RNI No.TELTEL/2016/68720

పోలీస్ నిఘా POLICE NIGAH తెలుగు దిన & మాస పత్రిక
పోలీస్ నిఘా POLICE NIGAH Web NEWS TV
రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను
Contact : 9133613813

ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా
POLICE NIGAH
తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రిపోర్టర్లు కావలెను
పోలీస్ నిఘా POLICE NIGAH NEWS TV
TG-AP
తెలంగాణ - ఆంధ్రప్రదేశ్
- మండలాల వారీగా కావలెను
- ఎలాంటి టార్గెట్స్ ఉండవు
- సీనియర్లకు ప్రాధాన్యం
- కొత్తవారికి అవకాశం
- లోగో, ఐ.డి. కార్డు, ట్యాగ్
- వెహికల్ స్టిక్కర్ ఇవ్వబడును.
9133613813, 9642614994
@PoliceNigahNewsTv

రంగారెడ్డి | సంపుటి : 10 సంచిక : 170 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | మంగళవారం 24-03-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8

## ఉద్యోగులకు ప్రమాద బీమా చరిత్రాత్మకం




హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : విధి నిర్వహణలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునే కార్యక్రమం చరిత్రాత్మకమని, ఇలాంటి పథకం దేశంలో మరెక్కడా లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రిమండలి ఉద్యోగుల క్షేమం కోసం ఆలోచన చేసి కేబినెట్‌లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు అసెంబ్లీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క రూ.కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందని, యజమానిపై ఆధారపడిన జీవితాలు తారుమారవుతున్న తీరును తాము గమనించామని తెలిపారు. ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి ఇలాంటి నిస్సహాయ స్థితి రాకూడదన్న మానవీయ ఆలోచనతోనే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 1.20 కోట్ల భారీ ప్రమాద బీమాను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని ప్రకటించారు. ప్రమాద బీమా పథకం ద్వారా విద్యుత్ సంస్థల్లోని 51 వేల మందికిపైగా, సింగరేణి సంస్థలోని 41 వేల మంది, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు 7.57 లక్షల మంది కుటుంబాల్లో ఈ పథకం భరోసాను కల్పిస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం రాగానే విద్యుత్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని

▶▶మిగతా 2లో

## ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా
# హైదరాబాద్

### అభివృద్ధి విషయంలో అన్ని పార్టీల నేతలూ ఒక్కటవ్వాలి
### శాసన మండలిలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. "ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ. 15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ




ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు.

**అభివృద్ధి విషయంలో అన్ని పార్టీల నేతలూ ఒక్కటవ్వాలి**

ముందు జాగ్రత్త తీసుకోకుంటే దిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## పశ్చిమాసియాలో యుద్ధంతో భారత్‌కు సవాళ్లు

**గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉంది**
**ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం..**
**లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ**



న్యూఢిల్లీ, మార్చి 23 :పశ్చిమాసియాలో యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లను తీసుకొచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్రిక్తతలపై నేడు ఆయన లోక్‌సభలో మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. యుద్ధ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు చెప్పారు. అక్కడ చిక్కుకొన్న భారతీయులను సురక్షితంగా తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎల్పీజీ విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

"పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను" అని మోదీ తెలిపారు.

"ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉంది" అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

**ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం..**

"దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నామన్నారు. "ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం" అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## ఇరాన్‌తో చర్చలు.. 5 రోజుల వరకు వాటిపై దాడులు చేయం: ట్రంప్

**ట్రంప్ వెనక్కి తగ్గారు: ఇరాన్**

వాషింగ్టన్, మార్చి 23 : హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలంటూ ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేసిన విషయం తెలిసిందే. లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామంటూ హెచ్చరించారు. ఈ క్రమంలోనే ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేసే విషయమై ఇరాన్‌తో రెండు రోజులుగా చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేయాలని తమ బలగాలను ఆదేశించినట్లు చెప్పారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతాయని, వాటి ఫలితంపై ఆధారపడి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు.

**దిగొచ్చిన చమురు ధరలు**

ఇరాన్‌పై దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దిగి వచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 13 శాతం మేర పతనమై 96 డాలర్ల స్థాయికి చేరింది. అంటే ఒక్క ప్రకటనతో 17 డాలర్ల మేర దిగొచ్చింది. అలాగే, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్




సైతం 13 డాలర్లు క్షీణించి 85 డాలర్ల స్థాయికి చేరింది.

**ట్రంప్ వెనక్కి తగ్గారు: ఇరాన్**

ట్రంప్ ప్రకటనపై ఇరాన్ స్పందించింది. విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న హెచ్చరికలతో ఆయన వెనక్కి తగ్గారని ఇరాన్ అధికారిక టెలివిజన్ పేర్కొంది. అఫ్గనిస్థాన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం సైతం ఇదే విధమైన వ్యాఖ్యలు చేసింది. తమ పవర్ ప్లాంట్‌లను అమెరికా లక్ష్యంగా చేసుకుంటే.. హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని అంతకు ముందు టెహ్రాన్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ కేంద్రాలను పునర్నిర్మించే వరకు హర్మూజ్‌ను తెరిచేదే లేదని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలు, సమాచార, ప్రసార సాంకేతికతలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది.

## కోర్టు ధిక్కరణను ఉపేక్షించేది లేదు

**తెలంగాణ ఫైనాన్స్ సెక్రటరీపై హైకోర్టు ఆగ్రహం**




హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : తెలంగాణ ఫైనాన్స్ సెక్రటరీపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరితగతిన చెల్లించాలని గత ఏడాది ప్రభుత్వానికి, ఫైనాన్స్ సెక్రటరీకి హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా బకాయిలు చెల్లించకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం వ్యక్తి గతంగా విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఫైనాన్స్ సెక్రటరీకి గతంలో హైకోర్టు ఆదేశించింది. నేడు కోర్టుకు వ్యక్తిగతంగా ఫైనాన్స్ సెక్రటరీ హాజరు కాకపోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రోజు విచారణకు హాజరు కావాల్సిందేనని సెక్రటరీని హైకోర్ట్ ఆదేశించింది. అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున ఆయన హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరుపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు స్పందిస్తూ.. 'ఈరోజు అర్ధరాత్రి వరకు కోర్టు హాలులోనే ఉంటాము. వ్యక్తిగత హాజరుకు ఎట్టి పరిస్థితుల్లో మినహాయింపు ఇచ్చే ప్రసక్తి లేదు. ఏడాది క్రితమే బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చాము'.. 'కోర్టు ధిక్కరణ కింద నోటిసులు ఇచ్చి ఆరు నెలలు అయింది. ఈ కాలంలోనే పదుల సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. అసెంబ్లీ సమావేశాలు ఉన్నట్లు ఆర్థిక శాఖ కార్యదర్శికి ముందే తెలుసు కదా ?. ముందే న్యాయస్థానం అనుమతి తీసుకోవాల్సి ఉండేది. కోర్టు ధిక్కరణ అంశాలను ఉపేక్షించేది లేదు' అని స్పష్టం చేసింది.

## శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా ఏర్పాటు చేస్తున్నాం: సీపీ సజ్జనార్

హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : హైదరాబాద్ నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సిద్ధమయ్యాయి. సీతారాం బాగ్ లోని ద్రౌపది గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమన్వయ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐఏఎస్ గారితో కలిసి నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు పాల్గొన్నారు. శోభాయాత్ర ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తుపై సీపీ దిశానిర్దేశం చేశారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో జరుపుకోవాలని కోరారు. భద్రత కోసం సుమారు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అడుగడుగునా సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా క్రైమ్ టీమ్స్, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. గతేడాది వాహనాల బ్రేక్‌డౌన్ వల్ల యాత్ర నెమ్మదించిన



విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి అలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. శోభాయాత్రను మధ్యాహ్నం 1 గంట కల్లా ప్రారంభించాలని, ఇరుకైన మార్గాల్లో పెద్ద వాహనాల వల్ల ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా ట్రయల్ రన్ నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. శబ్ద కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలని, ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినకుండా పాటలు, ప్రసంగాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు డ్రోన్లు వాడాలనుకుంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ప్రజలు, ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు సహకరించి శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటును ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వాహనాల ఎత్తు విషయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మిగతా 7లో

## ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత

**ప్రైవేటు బిల్లును ప్రతిపాదించిన బీఆర్ఎస్**



హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

## ప్రభుత్వ వివక్షకు నిరసనగా...
# రేపు జర్నలిస్టుల 'ఛలో హైదరాబాద్'



హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈనెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్- ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్–ఐఅండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో రాష్టవ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మధ్యదళారుల్లేకుండా | కలెక్టర్ అంకిత్
# నేరుగా విక్రయాలకు 'భద్రగిరి మార్ట్'



భద్రాచలం, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఆదివాసి మహిళలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, గిరిజన రైతులు తయారు చేసే ఉత్పత్తులు మధ్యదళారుల చేతికి వెళ్లకుండా నేరుగా వినియోగదారులకు చేరేందుకు 'భద్రగిరి మార్ట్' ఏర్పాటు చేయడం అభినందనీయమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. సోమవారం భద్రాచలం పట్టణంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భద్రగిరి మార్ట్‌ను ఐటీడీఏ పీవో బి. రాహుల్‌తో కలిసి ఆమె పరిశీలించారు. మార్ట్‌లో అందుబాటులో ఉంచిన నిత్యవసర సరుకులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, పిండి పదార్థాలు, తృణధాన్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకున్న గిరిజన రైతులు, మహిళలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు తమ ఉత్పత్తులను సరైన మార్కెట్‌కు చేరవేయడానికి ఇది మంచి వేదికగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకోవాలని సూచించారు. వినియోగదారులు భద్రగిరి మార్ట్‌ను సందర్శించి కల్తీ లేని ఆర్గానిక్ ఉత్పత్తులను సరసమైన ధరలకు కొనుగోలు చేసి గిరిజన మహిళలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ గిరిజన మహిళలు, రైతులు తయారు చేసిన ఇప్పపువ్వ లడ్డూలు, బర్ఫీ, చాక్లెట్లు, కరక్కాయ పొడి, కారంపొడి, తేనె, మిల్లెట్ బిస్కెట్లు, గానుగ నూనెలు, బియ్యం, పప్పులు, బొబ్బర్లు, నువ్వులు, కొర్రలు, సజ్జలు వంటి నిత్యావసర సరుకులు మార్ట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏపీవో పవర్ వేణు, పీవీటీజి అధికారి గన్యా, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్,ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏ సి ఎం ఓ రమేష్, డి ఈ హరీష్, ఏవో రాంబాబు, డీఎస్ఓ ప్రభాకర పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 127 వినతులు స్వీకరణ

**త్వరిత పరిష్కారానికి ఆదేశాలు: జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



వరంగల్, మార్చి 23 (పోలీస్ నిఘా) : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 127 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 50, జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి 16, ఇతర శాఖలకు సంబంధించినవి 61 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో, వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు, అలాగే సఖి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలతకు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించుతూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణి సందర్భంగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి, హాజరైన దరఖాస్తుదారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమం ఆలస్యం కావడంతో దరఖాస్తుదారులకు అరటిపండ్లు మరియు బట్టర్ మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేయగా, వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయ లక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, తదితర శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు

# భద్రాచలంలో పటిష్ట ఏర్పాట్లు: కలెక్టర్ ఆదేశాలు




భద్రాచలం, మార్చి 23 (పోలీస్ నిఘా) : శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం మరియు పట్టాభిషేకం మహోత్సవాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహిం చేందుకు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం భద్రాచలం మిథిలా స్టేడి యంలో నిర్వహించిన సమీక్ష సమావే శంలో వివిధ శాఖల లైజన్, సెక్టోరియల్ అధికారులతో ఆయన మాట్లాడారు. 26వ తేదీ ఉదయం 9 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో హాజరై తమకు కేటాయించిన సెక్టార్లను పరిశీలించి సిబ్బ ందిని సమన్వయం చేసుకోవాలని ఆదేశి ంచారు. భక్తులు, వీఐపీలు, వీవీఐపీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గెస్ట్ హౌస్‌లు, కూర్చునే ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఎవరైనా భక్తులు అస్వస్థతకు గురైతే వెంటనే వైద్య శిబిరాలకు తరలించాలని, అవ సరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ఆదేశించారు. 27న జరిగే కళ్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, 28న పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బందికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో భోజన వసతి కల్పించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలో కంప్యూటర్
# టెక్నాలజీ నైపుణ్యం ఎంతో కీలకం

**యూనిక్ ఇన్ఫోటెక్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు జానంపేట శివరాజ్ గౌడ్**

**షాబాద్ మండల కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం**





షాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : షాబాద్ మండల కేంద్రంలోని యూనిక్ ఇన్ఫోటెక్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ ఈ కేంద్రం బేసిక్స్, ఓూ ఆఫీస్,ఆఅం, ఖఉ ఆఅం, మరియు ఇతర సరికొత్త సాఫ్ట్‌వేర్ కోర్సులను శిక్షణ ఇస్తున్నట్లు యూనిక్ ఇన్ఫోటెక్ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు జానంపేట శివరాజ్ గౌడ్ తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలో యువతకు కంప్యూటర్ శిక్షణ అందిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 15 సంవత్సరాల నుండి షాబాద్ మండల కేంద్రంలో విద్యార్థిని విద్యార్థులకు, నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ అందించి శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్ మరియు ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆధునిక కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు పొందాలంటే సరికొత్త కంప్యూటర్ టెక్నాలజీ పరిజ్ఞానం తప్పనిసరి అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత కూడా కంప్యూటర్ నైపుణ్యాలు అభ్యసిస్తే ఐటీ, డేటా ఎంట్రీ, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ మార్కెటింగ్ వంటి అనేక రంగాల్లో అవకాశాలు పొందగలరని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ తీసుకోవడం ద్వారా తమ భవిష్యత్తును మరింత బలోపేతం చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ సేవలు కూడా ఎక్కువగా ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరమైందని ఆయన చెప్పారు.యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కంప్యూటర్ శిక్షణలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## కురవిలో పోలీసుల పేరుతో వసూళ్లు
**-నిందితుడు అరెస్ట్-**




మహబూబాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : పోలీసులమని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని కురవి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఫిర్యాదు దారుడు పులిచింతల శ్రీనివాస్ నుంచి రూ. 22,300 దోచుకున్న ఎర్పుల నాగరాజును అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.మహాశివరాత్రి జాతర సందర్భంగా బాధితుడిని బెదిరించి నగదు, ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకున్నట్టు గుర్తించారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నారు..ఇప్పటికే పలువురిని బ్లాక్‌మెయిల్ చేసిన చరిత్ర ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిర్మానుష ప్రదేశాల్లో ప్రేమికులను టార్గెట్ చేసి 'పోలీసుని' అంటూ డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కురవి ఎస్సై గంద్రాతి సతీష్ హెచ్చరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



రంగారెడ్డి, మార్చి 23 (పోలీస్ నిఘా) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (53) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ- 10, ఇతర శాఖలకు - 43, మొత్తం 53 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాది ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. కానీ తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ నేత హరీష్‌రావు తదితరులు అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు భట్టి విక్రమార్క సమాధానాలిచ్చారు. బీఆర్ఎస్ పెండింగ్‌లో పెట్టి వెళ్లిన మూడు డీఏలను తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచిందని, నాలుగో తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 సంవత్సరాలకు పెంచిందని, దాంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వంపై పడిందని చెప్పారు. ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశామని చెప్పారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ. 40,150 కోట్లు బకాయిలు పెట్టిందని, ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన బిల్లుల మొత్తం రూ. 4,575 కోట్లు ఉన్నాయని, తమ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెలా రూ. 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని వివరించారు. రాబోయే రోజుల్లో ఆ బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు రూ. 700 కోట్లను రూ. 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు యావత్ కేబినెట్ సభ్యులకు మానవీయ కోణం ఉన్నందునే ఉద్యోగులకు నగదు రహిత వైద్య చికిత్స కార్డులను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారు. మీా ప్రభుత్వ కాలంలో పదేళ్లపాటు హెల్త్ కార్డుల కోసం ఉద్యోగ సంఘాలు అడిగి అలసిపోయాయని ఘాటుగా విమర్శించారు. ఉద్యోగి ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుంబానికి రూ. 1.25 కోట్ల ప్రమాద బీమాను అమలు చేయబోతున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి దాదాపు రూ. 6,146 కోట్లు క్లియర్ చేశామని, పీఆర్సీ నివేదిక రాగానే పరిశీలించి కొత్త పీఆర్సీ అమలుపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. దానం పార్టీ మారిన వ్యవహారంపై స్పీకర్ తీర్పును కొట్టేయాలని పిటిషన్‌లో ఏలేటి కోరారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం.. కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

## ఉద్యోగులకు ప్రమాద బీమా చరిత్రాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

సింగరేణి, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో సంస్థల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని ఇప్పటికే ప్రారంభించామని భట్టి గుర్తు చేశారు. ఈ క్రమంలోనే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తూ 2025 అక్టోబర్ 10న మరణించిన వరుస సురేష్, మహబూబ్‌నగర్ సర్కిల్ సివిల్ విభాగంలో ఆర్టిజన్‌గా పనిచేస్తూ 2025 ఏప్రిల్ 19న మరణించిన ముక్తార్ బేగ్ కుటుంబాలకు రూ. 1.20 కోట్ల చొప్పున బీమా చెక్కులను అందజేసి ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వీరి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఒక కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి అకస్మాత్తుగా దూరమైతే ఆ కుటుంబం పడే మానసిక వేదనతోపాటు వారు ఎదుర్కొనే ఆర్థిక విపత్తు వర్ణనాతీతమని, ఆ అభద్రతాభావం ఏ ఒక్క తెలంగాణ బిడ్డకూ ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యం కాని రీతిలో ఒక మహత్తర జీవిత బీమా పథకాన్ని ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టామన్నారు. పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా చూడకుండా రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు, ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల చొప్పున ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ నిఘా

సంపాదకీయం | మంగళవారం | 24 మార్చి 2026

## సంక్షేమం - అభివృద్ధి సమతౌల్యం!

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఒక సాధారణ లెక్కల పత్రంగా మాత్రమే చూడటం సరిపోదు.. ఇది రాష్ట్ర అభివృద్ధి దిశను నిర్దేశించే దార్శనిక పత్రంగా కనిపిస్తోంది. రూ.3.24 లక్షల కోట్ల భారీ పరిమాణంతో రూపొందిన ఈ బడ్జెట్, గత సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన వృద్ధిని సూచిస్తూ, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రజల జీవితాల్లో తక్షణ ఉపశమనం కల్పించడమే కాకుండా, భవిష్యత్ ఆర్థిక స్థిరత్వానికి పునాది వేయాలనే ప్రయత్నం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా కనిపించే అంశం 'సంక్షేమ ఆధారిత వృద్ధి'. అంటే, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించాలనే దృక్పథం. మహిళలు, రైతులు, విద్యార్థులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు వంటి విభిన్న వర్గాలకు లక్ష్యంగా పథకాలను రూపొందించడం ద్వారా ప్రభుత్వం సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం ద్వారా ఆదాయం పెరగ డమే కాకుండా, ఆ ఆదాయం సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చేయాలనే లక్ష్యం కనిపిస్తోంది. మహిళల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఉచిత బస్సు ప్రయాణం, తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు మహిళల రోజువారీ జీవనాన్ని సులభతరం చేస్తున్నాయి. ఈ పథకాలు కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, మహిళల స్వతంత్రత ను పెంచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉచిత రవాణా వల్ల మహిళలు ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సేవలకు సులభంగా చేరుకునే అవకాశం పెరిగింది. అయితే, ఈ పథకాల వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా గణ నీయమైనదే. దీర్ఘకాలంలో ఇవి ఆర్థిక క్రమశిక్షణపై ప్రభావం చూపే అవకాశముంది. విద్యారంగంలో తీసుకున్న నిర్ణయాలు ఈ బడ్జెట్‌ను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ప్రీ–ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల విస్తరణ ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై దృష్టి పెట్టారు.. పోషకాహారం అందించడం వల్ల విద్యార్థుల హాజరు పెరగడమే కాకుండా, వారి నేర్చుకునే సామర్థ్యం కూడా మెరుగుపడుతుంది. ఇది భవిష్యత్‌లో నాణ్యమైన మానవ వనరులను తయారు చేయడంలో కీలకంగా మారుతుంది. అయితే, ఈ పథకాల అమలులో పారదర్శకత నాణ్యత నియంత్రణ అవసరం. వ్యవసాయ రంగానికి కేటాయించిన ?23,179 కోట్లు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించవచ్చు.. సౌర పంపులు, సూక్ష్మ నీటి పారుదల, పామాయిల్ సాగు వంటి కార్యక్రమాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడవచ్చు..గిరిజన రైతులకు 100% సబ్సిడీతో సోలార్ పంపులు అందించడం, పోడు భూముల్లో సాగును ప్రోత్సహించడం వంటి చర్యలు సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి మధ్య సమతౌల్యాన్ని చూపిస్తున్నాయి. పట్టణాభివృద్ధి ఈ బడ్జెట్‌లో కీలక అంశంగా నిలిచింది. హైదరాబాద్‌ను గ్లోబల్ నగరంగా తీర్చిదిద్దడం, ఇతర నగరాలకు కూడా అదే అభివృద్ధి మోడల్‌ను విస్తరించడం ప్రభుత్వ లక్ష్యం. మెట్రో విస్తరణ, మూసీ నది పునరుద్ధరణ, రహదారి అభివృద్ధి వంటి ప్రాజెక్టులు నగర జీవన ప్రమాణా లను మెరుగుపరచవచ్చు. ఇక సామాజిక సంక్షేమ కార్య క్రమాలకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రేషన్ కార్డుల జారీ, ఆరోగ్య సేవల విస్తరణ, గృహ నిర్మాణ పథకాలు వంటి చర్యలు పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడంలో కీలకంగా మారవచ్చు. నగదు రహిత ఆరోగ్య సేవలు, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు ద్వారా ఆరోగ్య సేవల ప్రాప్యతను పెంచే ప్రయత్నం కనిపిస్తోంది. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ఈ బడ్జెట్‌కు ఒక దీర్ఘకాలిక దిశను ఇస్తోంది. 2036 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాలను సాధించాలంటే సంక్షేమంతో పాటు ఉత్పాదక రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. పరిశ్రమలు, ఎగుమతులు, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెరగడం ద్వారా మాత్రమే ఈ లక్ష్యాలు సాధ్యమవుతాయి. మొత్తంగా చూస్తే, తెలంగాణ బడ్జెట్ 2026–27 ఒక సమతౌల్య ప్రయత్నంగా నిలుస్తోం ది. ఇది ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించే సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా, భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులపై కూడా దృష్టి పెట్టింది.

## కారుచీకట్లలో అల్లాడిపోతున్న క్యూబా ప్రజలు






కరేబియన్ దేశమైన క్యూబా ప్రస్తుతం చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సుమారు 11 మిలియన్ల జనాభా ఉన్న ఈ దేశం సంపూర్ణ విద్యుత్ కోతకు గురై, జనజీవనాన్ని స్తంభింపజేసింది. శిథిలావస్థలో ఉన్న విద్యుత్ గ్రిడ్, చమురు కొరత ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఫలితంగా ఆసుపత్రుల నుండి ఇళ్ల వరకు అన్నింటికీ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇది కేవలం సాంకేతిక వైఫల్యం మాత్రమే కాదు, దీని వెనుక అంతర్జాతీయ రాజకీయాలు, కఠినమైన ఆర్థిక ఆంక్షలతో కూడిన సుదీర్ఘ కథ ఉంది.

క్యూబా ఇంధన, గనుల మంత్రిత్వ శాఖ దేశ విద్యుత్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని అధికారికంగా ధృవీకరించింది. దేశ ప్రధాన విద్యుత్ గ్రిడ్ అకస్మాత్తుగా విఫలమవడంతో, ద్వీపమంతటా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. దశాబ్దాలుగా సరైన నిర్వహణ లేకపోవడంతో తీవ్రంగా బలహీనపడిన గ్రిడ్ శిథిలావస్థలోనే ఈ సంక్షోభానికి కారణమని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ వ్యవస్థను పునరుద్ధరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కానీ సవాళ్లు అపారమైనవి. థర్మల్ పవర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించే ప్రక్రియ మొదలైందని విద్యుత్ డైరెక్టరేట్ అధిపతి లజారో గెర్రా మీడియాకు తెలిపారు. అయితే, ఈ పనిని చాలా జాగ్రత్తగా, నెమ్మదిగా చేయాలని ఆయన హెచ్చరించారు. విద్యుత్ వ్యవస్థ చాలా బలహీనంగా ఉన్నప్పుడు, దానిపై అకస్మాత్తుగా అధిక భారం వేస్తే అది మళ్లీ విఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం, విద్యుత్తును పునరుద్ధరించిన తర్వాత అది మళ్లీ నిలిచిపోకుండా ఉండేందుకు, గ్రిడ్‌ను స్థిరీకరించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టవచ్చని నిపుణులు భావిస్తున్నారు. క్యూబన్లు ప్రస్తుతం చాలా కష్టకాలం ఎదుర్కొంటున్నారు. గత నాలుగు నెలల్లో ఇది మూడవ ప్రధాన విద్యుత్ అంతరాయం. దీంతో ప్రజల సహనం నశించిపోయింది. రాత్రిపూట, హవానా సహా ఇతర నగరాల వీధులు కేవలం కొవ్వొత్తుల వెలుగుతో మాత్రమే ప్రకాశిస్తున్నాయి. ఇళ్లలో నిల్వ ఉంచిన ఆహారం పాడైపోతోంది. వేడిమి వల్ల ప్రజలు నిద్రపోవడం కష్టంగా మారింది. చాలా మంది పౌరులు తీవ్ర మనోవేదనకు గురై, ఇప్పుడు దేశం విడిచి వెళ్ళిపోవడం గురించి మాట్లాడుతున్నారు. విద్యుత్, ప్రాథమిక సౌకర్యాలు లేని జీవితం వృద్ధులకు అసాధ్యంగా మారుతోంది. ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం, ఎంతో కృషి తర్వాత, రాజధాని హవానాలో కేవలం 5% మంది నివాసితులకు, కొన్ని ఎంపిక చేసిన ఆసుపత్రులకు మాత్రమే విద్యుత్తును పునరుద్ధరించారు. అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగేలా చూసేందుకు అధికారులు ప్రస్తుతం ఆసుపత్రులకు, కమ్యూనికేషన్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే, పునరుద్ధరించిన చిన్న సర్క్యూట్లు కూడా విఫలమయ్యే ప్రమాదంలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రధాన గ్రిడ్ పూర్తిగా పునరుద్ధరించే వరకు విద్యుత్ అంతరాయాలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. క్యూబాలో ఈ విద్యుత్ అంతరాయానికి చమురు సంక్షోభం ఒక ప్రధాన కారణంగా నిలిచింది. దేశంలోని విద్యుత్ ప్లాంట్లను నడపడానికి తగినంత ఇంధనం లేదు. క్యూబా తన చమురు అవసరాల కోసం ప్రధానంగా వెనిజులా, ఇతర మిత్ర దేశాలపై ఆధారపడుతుంది. కానీ అక్కడి నుండి సరఫరాలు తీవ్రంగా తగ్గిపోయాయి. అంతేకాకుండా, క్యూబా విద్యుత్ ప్లాంట్లు చాలా పాతవి, వాటి స్థానంలో కొత్తవి కొనడానికి ప్రభుత్వం తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య కొరతను ఎదుర్కొంటోంది. చమురు కొరత, పాతబడిన యంత్రాల కలయిక దేశాన్ని చీకటిలోకి నెట్టివేసింది. ఈ ఇంధన సంక్షోభానికి అమెరికా విధించిన ఆర్థిక, ఇంధన దిగ్బంధనమే కారణమని క్యూబా ప్రభుత్వం నేరుగా ఆరోపించింది. రాజకీయ, ఆర్థిక సరళీకరణ కోసం అమెరికా ప్రభుత్వం క్యూబాపై నిరంతరం ఒత్తిడి తెస్తోంది. క్యూబాకు చమురు సరఫరా చేసే దేశాలపై సుంకాలు విధిస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం బెదిరించడంతో, క్యూబా ఇంధన సరఫరా గొలుసుకు తీవ్ర అంతరాయం కలిగింది. క్యూబాలో ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పునరుద్ధరించాలని తాము కోరుకుంటున్నామని అమెరికా వాదిస్తుండగా, క్యూబా దీనిని తమ సార్వభౌమాధికారంపై దాడిగా పరిగణిస్తోంది.

## శాంతి నెపంతో కొనసాగుతున్న మారణహోమం



మనం.. (భారతీయులు మాత్రమే కాదు) కోరుకున్నది కాదు. అయినా సరే అందరం మూల్యం చెల్లించుకుంటున్నాం. 'కరోనా'ను మించిన ఒక విపత్కర సంక్షోభంలోకి మెల్లమెల్లగా అడుగుపెడుతున్నాం. గ్లోబలైజేషన్ కారణంగా ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా దాని ప్రభావం, పర్యవసానాలను యావత్ ప్రపంచం ఎదుర్కోవాల్సి వస్తోంది. మొన్నటి ఉక్రెయిన్–రష్యా యుద్ధం కారణంగా ప్రపంచ 'గోధుమ పాత్ర'గా పేరుగాంచిన ఉక్రెయిన్ – రష్యా ప్రాంతం నుంచి ఆహారధాన్యాల ఉత్పత్తిపై ప్రభావం పడింది. గోధుమ దిగుమతులపై ఆధారపడ్డ ప్రపంచ దేశాలు ప్రభావితమయ్యాయి. రష్యాపై ఆంక్షలు విధించి.. ఆ దేశం నుంచి చమురు, సహజవాయువు దిగుమతులపై ఆధారపడ్డ యూరోపియన్ సమాజం ప్రభావితమైంది. ఈ సంక్షోభంలో వైద్య విద్య కోసం ఉక్రెయిన్ వెళ్లిన భారతీయులు ప్రభావితమయ్యారు. రష్యా నుంచి చవక ధరకు చమురు కొని భారతదేశం సంక్షోభంలో అవకాశాన్ని వెతుక్కుంది. కానీ తాజా ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం సృష్టిస్తున్న సంక్షోభం ఎలాంటి అవకాశాన్ని సృష్టించే పరిస్థితి నాకైతే కనిపించడం లేదు. భారతదేశ అవసరాలు తీర్చే చమురులో 88% వరకు దిగుమతులపైనే ఆధారపడ్డ మన దేశం ఇప్పటికే గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల కొరత ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. వీటిపై ఆధారపడ్డ అనేక రంగాలు ఇప్పటికే ప్రభావితమయ్యాయి. కమర్షియల్ గ్యాస్ ఆధారిత పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఆ పరిశ్రమలపై ఆధారపడ్డ కార్మికులు ఇంటి బాట పట్టారు. సంక్షోభాన్ని కాసుల వేటగా మార్చుకునే కక్కుర్తితో బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ.. గ్యాస్ సిలిండర్లను 4–5 రెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఫలితంగా చిన్న చిన్న బడ్డీ కొట్ల నుంచి స్టార్ హోటళ్ల వరకు ప్రభావితమై.. యావత్ ఆతిథ్య రంగమే దెబ్బతింటోంది. 'చమురు' కొరత దాని ధరను పెంచుతుంది. ఇప్పటికే ఇరుగు పొరుగు ఆసియా దేశాల్లో వాటి ధరలు బాగా పెరిగిపోయాయి. భారత్‌లోనూ 'పెంపు' అనివార్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే ప్రీమియం పెట్రోల్, కమర్షియల్ డీజిల్ ధరలు పెరిగాయి. ఇక సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మాత్రమే మిగిలింది. ఈ ధరల పెరుగుదలతో సరకు రవాణా ధరలు పెరుగుతాయి. ఓవరాల్ ద్రవ్యోల్బణం పెరుగుతుంది. సామాన్యుడి ఆదాయం పెరగకపోగా.. దెబ్బతిన్న రంగాల్లో పనిచేస్తున్నవారైతే ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది. ప్రపంచ చమురు అవసరాలు తీర్చే గల్ఫ్ దేశాల్లోని చమురు, సహజవాయు క్షేత్రాలు దాడులకు గురవుతున్నాయి. ఒకవేళ యుద్ధం పూర్తిగా ఆగిపోయినా.. గల్ఫ్ దేశాల చమురు, సహజవాయువు ఉత్పత్తి సాధారణ స్థితికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. అంటే మనం దీర్ఘకాలిక ప్రభావానికి గురవ్వక తప్పదు అనిపిస్తోంది. ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకోవడం, పరిస్థితులకు తగినట్టు జాగ్రత్తపడడం (3 చేపల కథలో 'సుమతి'లా.. లేదంటే కనీసం 'కాలమతిలా వ్యవహరించడం) ఉత్తమం.

## అస్సాంలో కాంగ్రెస్‌కు వరుస షాక్‌లు



దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. పొత్తులు, సీట్ల సర్దుబాట్లు కూడా కొలిక్కి వచ్చాయి. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, పార్టీలు ప్రచారం జోరు కూడా పెంచుతున్నాయి. అయితే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో కాంగ్రెస్ బలంగా కనిపిస్తోంది. అయితే ఈ సమయంలో ఆ పార్టీ నేతలు షాక్ ఇస్తున్నారు. పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర బోరా తర్వాత మార్గరీటా ఎంపీ ప్రద్యుత్ బోర్గ్లై రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు ప్రతీక్ కూడా పార్టీ టిక్కెట్ తిరస్కరించి పోటీకి సిద్ధం కాదని ప్రకటించడంతో పార్టీకి మరింత షాక్.

### సీనియర్ నేతల రాజీనామాలు

ప్రద్యుత్ బోర్గ్లై, నాగావ్ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎంపీ, అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి రాజానామా చేశారు. భూపేంద్ర బోరా రాజీనామా తర్వాత ఇది మరో దెబ్బ. మార్గరీటా అసెంబ్లీ స్థానానికి ప్రతీక్ బోర్గ్లై ప్రకటించింది కాంగ్రెస్. అయితే తాను పోటీ చేయనని తెలిపారు. ఈ సంఘటనలు పార్టీ స్థిరత్వాన్ని దెబ్బతీశాయి.

### 80 మంది కీలక నేతలు కూడా..

ప్రద్యుత్ రాజీనామాతో పాటు 80 మంది కీలక కార్యకర్తలు కాంగ్రెస్ వదిలేశారు. ఎన్నికల ముందే ఈ సంఖ్యలో వలసలు పార్టీ ఓటు బ్యాంకును బలహీనపరుస్తున్నాయి. బీజేపీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మీడియా ద్వారా మాజీ కాంగ్రెస్ నేతలను ఆకర్షిస్తూ పార్టీ బలం పెంచుకుంటోంది.

### అంతర్గత సంక్షోభం

కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపిక, నాయకత్వ విభేదాలు ప్రధాన కారణాలు. ఒకప్పుడు అస్సాంలో బలమైన పార్టీగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్యం ముందు బలహీనపడుతోంది. రాహుల్, ప్రియాంక గాంధీ ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఈ వలసలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయి. బీజేపీ ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్ బలహీనతను హైలైట్ చేస్తోంది. మార్గరీటా స్థానంలో తండ్రి–కొడుకుల విభజన రాజకీయ ఆసక్తిని రేపుతోంది. కాంగ్రెస్ ఈ సంక్షోభాన్ని అధిగమించకపోతే అస్సాంలో మరింత బలహీనపడుతుంది.

## యుద్ధ వ్యూహం మార్చిన ఇరాన్



ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ కూడా శక్తిమేరకు పోరాడుతోంది. అయితే అమెరికా –ఇజ్రాయెల్ ముందు ఎంతో కాలం నిలబడే అవకాశం లేదు. ఆ విషయం ఇరాన్‌కు కూడా తెలుసు. అందుకే ఇరాన్ తన రక్షణ కోసం కొత్త వ్యూహం ఎంచుకుంది. తాను మునిగిపోయే పరిస్థితి వస్తే.. తనతోపాటు ప్రపంచ దేశాలన్నీ మునిగిపోవాలని భావిస్తోంది. లేదా మునిగిపోతాయనే భయమైనా కల్పించాలి. అందుకు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అల్లకల్లోలం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో భారత్‌తో సహా అనేక దేశాల్లో ద్రవ్యోల్బణాన్ని పెంచుతూ మార్కెట్లను కుప్పకూల్చింది.

### గెలవలేమని తెలిసి..

అమెరికా–ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ రక్షణ పరిస్థితి బలహీనపడినా, ఆ దేశం ప్రత్యాంతిక దాడుల ద్వారా ప్రతిఘటిస్తోంది. గల్ఫ్ ప్రాంతంలోని రిఫైనరీలు, గ్యాస్ కేంద్రాలు, ఎగుమతి ఓడరేవులపై దాడులు చేసి ఇంధన ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. హర్మూజ్ జలసంధి మూసివేయడం వల్ల ప్రపంచ చమురు రవాణాలో 20% అడ్డంకి వచ్చింది, ఇది సౌదీ, యూఏఈ, ఖతార్ వంటి దేశాల ఆదాయాలను ప్రభావితం చేస్తోంది.

### రెట్టింపైన చమురు ధరలు..

యుద్ధానికి ముందు ఆయిల్ ధర బ్యారెల్‌కు 60–70 డాలర్లు ఉండగా, ప్రస్తుతం 100–117 డాలర్లకు చేరాయి. అంటే దాదాపు రెట్టింపయ్యాయి. ఈ ఊగిసలు హర్మూజ్ ఆంక్షలు, గల్ఫ్ దాడుల వల్లే వచ్చాయి, ప్రపంచ సరఫరా గొలుసులను స్తంభించేశాయి. ఫలితంగా ఇండియా, చైనా, పాకిస్తాన్‌లో ఇంధన కొరత ఏర్పడి, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. యురోపియన్ యూనియన్‌పైనా ప్రభావం పడుతోంది.


### ఆర్థిక పరిణామాలు

ఇంధన ధరల పెరుగుదల వస్తువుల ధరలను, రవాణా ఖర్చులను పెంచుతూ ద్రవ్యోల్బణాన్ని రెక్కిపెట్టింది. భారత మార్కెట్‌లో 240 బిలియన్ డాలర్ల ఇన్వెస్టర్ల సొమ్ము తుడిచిపెట్టుకుపోయింది. రూపాయి విలువ ఆల్‌టైం కనిష్టానికి 93కు పడిపోవడం దీని ప్రభావాలు.

### భారత్‌పై ప్రభావం

భారత్ దిగుమతి చమురుపై ఆధారపడటం వల్ల ఇంధన, విద్యుత్, వ్యవసాయ, పరిశ్రమలు దెబ్బతింటున్నాయి. ఆహారం, పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం 5–8%కు చేరే అవకాశం ఉంది. ప్రభుత్వం రిజర్వులు, పునరుత్పాదక ఇంధనాలపై దృష్టి పెట్టాలి. ఇరాన్ వ్యూహం ప్రపంచ దేశాలను పరోక్షంగా అమెరికాపై ఒత్తిడి చేయడానికి ఉపయోగపడుతోంది. దీర్ఘకాలంగా ఇంధన వైవిధ్యత, డిప్లొమసీ అవసరం. లేకపోతే ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతుంది.

## హైదరాబాద్ ఐటీకి గడ్డు కాలమా?



ఒకప్పుడు ప్రపంచ దిగ్గజ సంస్థలన్నీ క్యూ కట్టిన నగరం.. నిరంతరం కోడింగ్ లయలతో కీబోర్డ్ శబ్దాలతో ప్రతిధ్వనించే హైటెక్ సిటీ వీధులు.. నేడు ఒక తెలియని నిశ్శబ్దంలో కూరుకుపోతున్నాయా? తెలంగాణ ఐటీ రంగానికి గడిచిన రెండేళ్లుగా ఒక రకమైన 'గడ్డు కాలం' దాపురించిందన్నది కాదనలేని సత్యం.

### అంకెలు చెబుతున్న చేదు నిజం

గణాంకాలు అబద్ధం చెప్పవు. 2023లో 9.46 లక్షల ఉద్యోగాలతో కళకళలాడిన హైదరాబాద్ ఐటీ రంగం.. 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోవడం అంటే అది కేవలం సంఖ్యల తగ్గుదల మాత్రమే కాదు.. వేల కుటుంబాల ఆశల మీద పడ్డ దెబ్బ. కేటీఆర్ విమర్శించినట్లుగా ప్రభుత్వం స్వయంగా అసెంబ్లీలోనూ, బడ్జెట్ ప్రసంగంలోనూ ఈ తగ్గుదలను అంగీకరించడం ఐటీ ఉద్యోగుల్లో గుబులు రేపుతోంది.

### ప్రశ్నార్థకమైన భవిష్యత్తు

పెట్టుబడులను ఆకర్షించడంలో, ఉన్న కంపెనీలను నిలుపుకోవడంలో ప్రభుత్వం తన పట్టు కోల్పోయిందా? కృత్రిమ మేధస్సు పాత ఉద్యోగాలను మింగేస్తోందా? ఒకవేళ అదే నిజమైతే, యువతను కొత్త నైపుణ్యాల వైపు మళ్లించడంలో పాలకులు ఎందుకు వెనుకబడ్డారు? ప్రపంచ స్థాయి మౌలిక వసతులకు పేరుగాంచిన హైదరాబాద్‌పై ఇన్వెస్టర్ల నమ్మకం సడలుతోందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

### యువత ఆవేదన

ఒక ఐటీ ఉద్యోగం అంటే అది కేవలం ఒక జీతం కాదు.. మధ్యతరగతి తల్లిదండ్రుల కల, ఒక యువకుడి లేదా యువతి కష్టానికి దక్కిన ఫలితం. నేడు ఎంతో మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ కెరీర్ ఎటు వెళ్తుందో తెలియక, ఎప్పుడు పింక్ స్లిప్ వస్తుందోనని ఆందోళనతో గడుపుతున్నారు. గతంలా కొత్త నియామకాలు లేవు, ఉన్న కొలువులు ఊడిపోతున్నాయి. "హైదరాబాద్ ఐటీ అభివృద్ధి రథం ఆగిపోయిందా? లేక వెనక్కి పయనిస్తోందా?" అన్నది ఇప్పుడు ప్రతి తెలంగాణ బిడ్డ మదిలో మెదులుతున్న ప్రశ్న. రాజకీయ విమర్శలు పక్కన పెడితే, ఐటీ రంగం మళ్ళీ పుంజుకోవాలంటే తక్షణ కార్యాచరణ అవసరం. లేదంటే ఐటీ హబ్‌గా మనం సంపాదించుకున్న కీర్తి ప్రతిష్టలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు మారినా.. అభివృద్ధి వేగం తగ్గకూడదని కోరుకోవడం ప్రజల కనీస హక్కు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి, మార్చి 23 (పోలీస్ నిఘా): సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల శ్రీ సాయి కృష్ణ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, హాల్ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా చర్యలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్ లు పరీక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేని వ్యక్తులను, ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

## దెందుకూరు గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం

### దెందుకూరు గ్రామంలోని యస్ సీ కాలనీలో కంపచెట్లు చెత్తాచెదారం తొలగింపు పనులు

### నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి బాట పయనిస్తున్న గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు



మధిర, మార్చి 23 (పోలీస్ నిఘా) : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దెందుకూరు గ్రామంలోని చెత్త చెదారం ఏరివేత, కంప చెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. యస్ సీ కాలనీలో ప్రధాన వీధిలో మరియు చిన్న చిన్న దారుల్లో కంపచెట్లు పెరగటం చెత్తా చెదారం పేరుకుపోవటాన్ని గమనించిన సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాస రావు వెంటనే సిబ్బంది తో చెప్పి పనులు చూడాలని చెప్పారు. ఈరోజు ఉదయాన్నే దెందుకూరు గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్డు కు ఇరుపక్కల పెరిగిన కంపచెట్లను మరియు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కంపచెట్లను చెత్తాచెదారం తొలగించిన అనంతరం యస్ సీ కాలనీలో పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారింది కాలనీ వాసులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా చాలా సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ఉన్నట్లు అదేవిధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ఓబిసిల మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ గజ్జెల సత్య రాజ్ గౌడ్




ఉప్పల్, మార్చి 23 (పోలీస్ నిఘా) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ఓబీసీల మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ గజ్జెల సత్యరాజ్ గౌడ్కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 2026 నుండి చేపడుతున్న జాతీయ జనగణన కార్యక్రమంలో ఓబీసీల కులగణన చేపట్టాలని న్యూఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ఓబీసీల మహాధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గజ్జెల సత్యరాజ్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ జన గణనలో బీసీల కులగణన చేయాలని జనగణన కాలంలో మొత్తం 33 కాలం లు ఉంటే అందులో కాలం నెంబర్ 12 లో ఎస్సీ ఎస్టీ మరియు అదర్స్ అని ఉంది కానీ, ఓబీసీల కాలం లేదు కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే ఓబిసి కాలం చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఎస్సీ ఎస్టీ ఓబీసీ మరియు అదర్స్ చేయాలని ఓబిసిల జనాభా ఎంతో స్పష్టంగా తెలియజేప్పాలని కేంద్రాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంపీ మల్లు రవి మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్, 29 రాష్ట్రాల నుంచి ఓబీసీ ప్రతినిధులు, బీసీ నేతలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముహూర్తం



చేవెళ్ల, మార్చి 23 (పోలీస్ నిఘా) : పేదలకు ఇల్లు కల్పించడం ప్రభుత్వ ధ్యేయమని 18వ వార్డు కౌన్సిలర్ కళ్యాణి యాదిగిరి పేర్కొన్నారు. ఆదివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో నాగని స్వప్న-రాములు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముహూర్తం కార్యక్రమాన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కళ్యాణి యాదిగిరి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఇళ్లు అందిస్తోందని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇది గొప్ప అవకాశమన్నారు. పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు: కలెక్టర్

### ఫార్మ్ మెకనైజేషన్ & తేనెటీగల పెంపకం పథకాలపై కలెక్టర్ సమీక్ష



సంగారెడ్డి, మార్చి 23 (పోలీస్ నిఘా) : జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో జిల్లాలో అమలవుతున్న ఫార్మ్ మేకనైజేషన్, వర్షాదార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని పరిశీలించి, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని, రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని , ఈ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని, ఎక్కువ మంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, కమర్షియల్ స్థాయిలో తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ ఏపీడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

# మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

### హనుమకొండ జిల్లా కలెక్టర్/జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

### నగరంలో ఆకస్మిక క్షేత్ర స్థాయి పన్ను వసూళ్ల పరిశీలన



హనుమకొండ, మార్చి 23 (పోలీస్ నిఘా) : మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పరిధిలోని 48, 49, 50, 51 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించిన కలెక్టర్, పన్ను వసూళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలోని ఈ-సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, పన్ను చెల్లింపుల ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎంత మొత్తంలో వసూళ్లు జరుగుతున్నాయి, ఏ సమయాల్లో సేవలు అందిస్తున్నారు వంటి అంశాలపై విచారించారు. 51వ డివిజన్‌లో రెవిన్యూ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించారు. 50వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో, సంబంధిత డివిజన్లకు చెందిన బకాయిల జాబితా, ఇప్పటివరకు జరిగిన వసూళ్ల వివరాలు, ఇంకా వసూలు చేయాల్సిన బకాయిల జాబితా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ జాబితాను ఆధారంగా తీసుకుని, బిల్ కలెక్టర్లు ప్రతి 20 అస్సెస్మెంట్ ల చొప్పున విభజించి వసూళ్లను చేపట్టాలని తెలిపారు. అలాగే, పి.ఓ.ఎస్ యంత్రాలను వినియోగంలో ఉంచి, ప్రజలు స్థానికంగానే పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని ప్రతి గృహం నుంచి పన్నులు చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. 49వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా ఒకే ఇంటికి రెండు లేదా మూడు హౌస్ నంబర్లు ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వాటిని తక్షణమే సరిచేయాలని అధికారులను ఆదేశించారు.

48వ డివిజన్‌లో సుమారు 900 గృహాల నుంచి పన్ను వసూళ్లు చేపట్టాలని సూచిస్తూ, కొన్ని డివిజన్లలో రూ. లక్షల్లో బకాయిలు ఉన్నాయని తెలిపారు. లక్ష్యాలను సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ, ప్రతిరోజూ వార్డులో కనీసం రూ. 3 లక్షల వసూళ్లు సాధించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఆర్ఐ అనిల్ కుమార్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగత్ సింగ్ 95వ వర్ధంతి



మందమర్రి , మార్చి 23 (పోలీస్ నిఘా) : మందమరి పట్టణంలోని మనోవికాస్ మానసిక వికలాంగుల పాఠశాలలో సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతిని మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పివ్ హాల్ రాణి పివ్ హాల్ దంపతులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ పీవ్ హాల్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 28, 1907న పంజాబ్‌లోని లియాల్‌పూర్ (ప్రస్తుత పాకిస్తాన్) లోని బంగా గ్రామంలో భగత్ సింగ్ జన్మించారు. కిషన్ సింగ్, విద్యావతి దంపతుల కుమారుడు. చిన్నప్పటి నుంచి దేశభక్తి నేపథ్యం ఉన్న భగత్ సింగ్ కుటుంబ (1907-1931) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అతివాద విప్లవకారుడు, పంజాబ్‌లో జన్మించిన ఆయన, జలియన్ వాలాబాగ్ దుర్ఘటన చిన్న వయస్సులోనే భగత్ సింగ్‌ను తీవ్రంగా కలచివేసింది. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని విరమించుకున్నాక, విప్లవాత్మక మార్గం వైపు మళ్లారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ స్థాపనలో కీలక పాత్ర పోషించారు. లాహోర్ పోలీసు అధికారి జాన్ సాండర్స్‌ను (లాలా లజపత్ రాయ్ మరణానికి కారణమైన అధికారిగా భావించి) హతమార్చారు. అసెంబ్లీ బాంబు దాడి బ్రిటిష్ చట్టాలను నిరసిస్తూ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో బాంబులు విసిరారు. జైలులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం 116 రోజుల పాటు నిరాహారదీక్ష చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదంతో యువతలో స్ఫూర్తి నింపారు. లాహోర్ కుట్ర కేసులో పాల్గొని, 1929లో అసెంబ్లీలో బాంబులు విసిరినందుకు, 23 ఏళ్ల వయస్సులోనే భగత్ సింగ్ ను రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి ఉరిశిక్ష మార్చి 23, 1931న లాహోర్ జైలులో ఉరితీశారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ

### ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, మార్చి 23 (పోలీస్ నిఘా) : ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అంశాలపై ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా మధ్యవర్తిత్వం లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## భద్రాచలంలో 7.4 కిలోల గంజాయి పట్టివేత...ఇద్దరు అరెస్ట్



భద్రాచలం, మార్చి 23 (పోలీస్ నిఘా) : భద్రాచలం సరిహద్దు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సోమవారం ఇసుక ర్యాంపు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టిన సందర్భంగా, నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 7.4 కిలోల ఎండు గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఈఎస్‌కే తిరుపతి ఆదేశాల మేరకు, ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ చావా శ్రీహరి రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఇసుక ర్యాంపు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. ఈ కేసులో సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన బొడ్డు చందు (తండ్రి యోగేంద్ర ప్రసాద్), కూరాకుల రోహిత్ (తండ్రి శ్రీనివాస్)లను అరెస్ట్ చేశారు. వీరు ఒడిశాలోని కలిమెల ప్రాంతం నుంచి సిద్దిపేట జిల్లాకు గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

స్వాధీనం చేసిన సొత్తు: 7.4 కిలోల ఎండు గంజాయి నంబర్ లేని ద్విచక్ర వాహనం రెండు మొబైల్ ఫోన్లు మొత్తం స్వాధీనం చేసిన సొత్తు అంచనా విలువ రూ. 4,90,000/-గా అధికారులు తెలిపారు. నిందితులను, స్వాధీనం చేసిన వస్తువులను తదుపరి చర్యల కోసం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

## భద్రగిరికి భద్రత భరోసా: సీపీఐ(ఎం) డిమాండ్లు




భద్రాచలం, మార్చి 23 (పోలీస్ నిఘా): శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను సీపీఐఎం స్వాగతించింది. కరకట్ట పునర్నిర్మాణం చేపట్టి పోలవరం ముంపు నుంచి భద్రాచలానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసింది. కరకట్ట నిర్మాణం లేకపోతే రామయ్యపట్నానికి ముప్పు తప్పదని హెచ్చరించింది. రామాలయ అభివృద్ధికి ప్రతిపాదించిన రూ.580 కోట్లు ఒకేసారి విడుదల చేసి పట్టణ సుందరీకరణ పనులను కూడా వెంటనే ప్రారంభించాలని కోరింది. మాడవీధుల అభివృద్ధిలో స్థలాలు కోల్పోయిన పేదలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద శ్రీరామనవమి రోజునే ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. భద్రాచలం కేంద్రంగా ప్రభుత్వ ఇసుక రీచ్‌ను ప్రారంభించి ప్రజలకు ఇసుక అందుబాటులోకి తేవాలని, నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సూచించింది. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు వంద కిలోమీటర్ల మేర అంబులెన్స్ లు కూడా వచ్చే పరిస్థితి కూడలేనందున్న రహదారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని, ప్రస్తుత అసెంబ్లీలోనే తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.జే. రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్‌బాబు, పట్టణ నాయకులు ఎర్రంశెట్టి వెంకటరామారావు, పారెల్లి సంతోష్‌కుమార్, డి. సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ శివప్రతాప్ శుక్లకు అదనపు కలెక్టర్ ఘన స్వాగతం



యాదగిరిగుట్ట, మార్చి 23 (పోలీస్ నిఘా) : భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఇటీవల నిర్వహించిన పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడానికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి రిసీవ్ చేసుకున్నారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందిస్తూ, గవర్నర్ వారికి బహుమతులు అందజేశారు. యువత క్రీడల్లో ముందుకు రావాలని, శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

-భరోసా కల్పించిన పెండెం శ్రీ లక్ష్మి రామానంద్-



నర్సంపేట, మార్చి 23 (పోలీస్ నిఘా) : నర్సంపేట డివిజన్ ఎబి ఎన్ రిపోర్టర్ బుర్ర వేణు గారి పెద్ద కుమార్తె బుర్ర భువన అనా రోగ్యం తో ఆకాల మర ణం చెందగా భౌతిక దేహానికి పూల మాల వేసి,ఘన నివా ళుల ర్పించి వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపిన.మున్సి పల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామా నంద్ వారి వెంట కాంగ్రె స్ పార్టీ నాయకు లు ఉ మాజీ కౌన్సిలర్ చింతల సాంబ రెడ్డి,10వ వార్డు ఇంచా ర్జ్ దేవండ్ల రాంబా బు,నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ మెంబర్ దూసరి కర్ణాకర్,ఏడెల్లి అశోక్ పాల్గొన్నారు.

## నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు



వరంగల్, మార్చి 23 (పోలీస్ నిఘా) : జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు సోమావారం స్పెషల్ ఎస్.ఎన్.సి.యు. ఎం.జీ.ఎం.హాస్పిటల్ ముందు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు భోజన సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు మాట్లాడుతూ..... సెప్టెంబర్ నుండి ఫిబ్రవరి వరకు 6 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేయాలని, ప్రతి నెల 5వ తేదీన వేతనాలు అందరికీ చెల్లించాలని, తక్షణమే పై సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28 మార్చి 2026 తేదీ లోపు పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లించాలని చెల్లించలేని పక్షాన 29 మార్చి 2026 ఆదివారం రోజున హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ లో మహాధర్నా కు వెళ్తామని ప్రభుత్వాన్ని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సపోర్టింగ్ స్టాఫ్ డి.ఉమాదేవి,ఎన్.రమాదేవి, ఎల్.సుధ, సి.హచ్. సునీత, ప్రవళిక , జై.కల్పన, బీ.విజయ, జె .స్వరూప మరియు తదితరులు పాల్గొన్నారు.


## యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నంబర్‌గా తుప్పతీ స్వప్న బీరప్ప



అడ్డగూడూరు, మార్చి 23 (పోలీస్ నిఘా) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు తుప్పతీ స్వప్న బిరప్ప నూతనంగా విడుదల చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా తుంగతుర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ మందుల సామేలు గారి సూచన మేరకు నియామకమైనారు. ఈరోజు భువనగిరి వివేరా హోటల్లో నిర్వహించిన సమావేశంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామిల్, జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది, తదనంతరం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుప్పతి స్వప్న బీరప్ప మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాకు నూతన బాధ్యతలు అప్పగించినా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ గారికి,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు గారికి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారికి,డీసీసీ అధ్యక్షులు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని తెలియజేశారు. తన ఎన్నికకు సహకరించిన అడ్డగూడూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో అల్పాహార పంపిణీ

**మాజీ అన్నదాన కమిటీ గౌరవాధ్యక్షుడు ఏంజాల శ్రీనివాస్ సతీమణి లతా శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు.**



పటాన్ చెరు, మార్చి 23 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా, పఠాన్ చేరు పట్టణం,శాంతినగర్, శ్రీనగర్ కాలనీలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతీ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ వారం ప్రత్యేకంగా అల్పాహార పంపిణీ నిర్వహించారు. మాజీ అన్నదాన కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎంజాల శ్రీనివాస్ సతీమణి లత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన సుమారు 400 మంది భక్తులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, భజన కమిటీ సభ్యులు, యువజన కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# మల్టీ లెవల్ మార్కెటింగ్ భారీ కుంభకోణం గుట్టురట్టు





హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల మేర ప్రజలను మోసం చేస్తూ, అక్రమ ద్రవ్య చలామణి పథకాలను ప్రోత్సహిస్తున్న 'విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థపై హైదరాబాద్ సిటీ పోలీస్ కి చెందిన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ప్రత్యేక బృందాలు మెరుపు దాడులు నిర్వహించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 32 మంది నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.

కేసు వివరాలు: గతంలో గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్ నెట్ అని పిలవబడే ఈ సంస్థ, హాంకాంగ్ కేంద్రంగా పనిచేసే 'క్యూఐ గ్రూప్'కు చెందిన అనుబంధ సంస్థ. ఈ సంస్థ ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిరుద్యోగులు, గృహిణులు మరియు వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతోంది.

మోసపూరిత విధానం: నిందితులు హైటెక్ సిటీలోని ప్రముఖ హోటళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ-కామర్స్ వ్యాపారం మరియు పెట్టుబడుల పేరుతో ప్రజలను ఆకర్షిస్తారు. 5 నుండి 10 లక్షల

### 32 మంది నిందితుల అరెస్ట్

రూపాయల పెట్టుబడి పెడితే, రెండేళ్లలో 3 నుండి 4 కోట్ల రూపాయల లాభం వస్తుందని నమ్మిస్తారు.

గోప్యత: ప్రారంభంలో వీరు క్యూ నెట్ పేరును కానీ, ఇది ఒక మల్టీ లెవల్ మార్కెటింగ్ లేదా బైనరీ పద్ధతి అని కానీ వెల్లడించరు.

తప్పుదారి పట్టించడం: బాధితులు డబ్బు చెల్లించిన తర్వాత, వారి ప్రమేయం లేకుండానే ఆ మొత్తాన్ని వస్తువుల కొనుగోలుకు మళ్లిస్తారు. ఇంటికి వస్తువులు వచ్చినప్పుడు, అవి కంపెనీ ఇచ్చిన బహుమతులని నమ్మిస్తూ అసలు పెట్టుబడిని పథకంలోకి మారుస్తారు.

చట్టవిరుద్ధమైన పథకాలు: ఈ సంస్థ బైనరీ స్కీమ్ (1+2+4+8...) పద్ధతిలో పనిచేస్తుంది. ఇందులో చేరిన వారిని 'ఇండిపెండెంట్ రిప్రజెంటేటివ్స్' అని పిలుస్తారు. కొత్త సభ్యులను చేర్పించడం ద్వారా భారీ కమిషన్లు వస్తాయని ఆశ చూపడం, 'ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (నిషేధిత) చట్టం, 1978' ప్రకారం నేరం. గౌరవనీయ సుప్రీంకోర్టు సైతం ఇటువంటి పథకాలు సాధ్యం కావని, ఇవి ప్రజలను వంచించే మార్గాలని గతంలోనే స్పష్టం చేసింది.

అరెస్టుల వివరాలు: ఈ రోజు (23-03-2026), హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు 30 బృందాలుగా విడిపోయి నిర్వహించిన అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లో 11 మంది మహిళలతో సహా మొత్తం 32 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో అత్యధికులు ఐటీ ఉద్యోగులు కావడం గమనార్హం. ప్రస్తుతం నమోదైన 4 కేసులలో 11 మంది బాధితుల నుండి సుమారు 75 లక్షల రూపాయల నష్టం జరిగినట్లు గుర్తించాము. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రజలకు విజ్ఞప్తి: సామాన్య ప్రజలు ఇటువంటి మోసపూరిత మల్టీ లెవల్ మార్కెటింగ్ పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము. ఇటువంటి పథకాల్లో చేరడం, ఇతరులను చేర్పించడం లేదా వీటి ద్వారా డబ్బు సంపాదించడం చట్టరీత్యా నేరం. బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించగలరు.

# ప్రెస్ క్లబ్బా..? ప్రైవేటు క్లబ్బా..?



**అక్రమ వసూళ్లు - లెక్కలపై అనుమానాలు**

**తాళాలు కొద్దిమందికే..**

**ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరణ**

**కలెక్టర్ తక్షణ విచారణ చేయాలి**

**టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్-2843) డిమాండ్**

ఖమ్మం, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న వ్యవహారాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. జర్నలిస్టుల ఉమ్మడి వేదికగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్‌ను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని 'ప్రైవేట్ క్లబ్'లా నడుపుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్-2843) జిల్లా కమిటీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణలు లోకల్ బాడీస్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సభ్యత్వాల పేరుతో రూ.1000 నుంచి రూ.3000 వరకు ఎటువంటి నిబంధనలు, రశీదులు లేకుండా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని నేతలు ఆరోపించారు. ఈ నిధులపై ఎటువంటి లెక్కలు, ఖాతాలు వెల్లడించకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. ఇప్పటివరకు క్లబ్ నిధులపై ఆడిట్ నిర్వహించలేదని, లెక్కలు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ప్రెస్ క్లబ్ తాళాలు కూడా కొద్దిమంది వ్యక్తుల వద్దే ఉండటం, ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరించడం, వాట్సాప్ గ్రూపుల్లో ఇతర యూనియన్ ప్రతినిధులకు అడ్మిన్ హక్కులు ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని టిడబ్ల్యూజెఎఫ్ నేతలు తెలిపారు. ఇటీవలి కాలంలో జర్నలిస్టులను అడ్డుకోవడం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రెస్ స్వేచ్ఛపై నేరుగా దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమ వసూళ్లపై ఆడిట్ నిర్వహించి లెక్కలు బహిర్గతం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ సమాన హక్కులు కల్పించాలని టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్-2843) నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, నగర అధ్యక్షులు గెంటేల కుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, నాగకృష్ణ, శ్రీధర్, వెలిగొండ వెంకట్, రవి, మొగిలి నాగేశ్వర రావు, ఎం.ఎస్. చిన్ని, మామిడాల వీరబాబు, తానంగి భిక్షం, పాగ యోనా, తిరుపతి కొండలరావు, పి.శ్రీను, సవల బాలరాజు, నీరుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఐలాపూర్‌లో అంగరంగ వైభవంగా మల్లన్న జాతర ను నిర్వహించిన కురుమ సంఘం పెద్దలు



పటాన్ చెరు, మార్చి 23 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా,పటాన్ చెరు నియోజకవర్గం,అమీన్ పూర్ డివిజన్ ఐలాపూర్ గ్రామంలో మల్లన్న జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కుర్మా మల్లేష్ యాదవ్, ఆలయ అధ్యక్షుడు కురుమ మహేందర్ యాదవ్ మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ జాతరలో మొదటి రోజు మల్లన్న స్వామివారి కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కాట సుధారాణి, మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్ ఇరువురు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు, పోతురాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, యువత నృత్యాలు ఎంతగానో అలరిచ్చాయి, మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి బోనం సమర్పించారు, తదుపరి రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

-గ్రామ సర్పంచ్ కంది శ్వేత క్రిష్ణ చైతన్య-



చెన్నారావుపేట, మార్చి 23 (పోలీస్ నిఘా) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని చెన్నారా వుపేట గ్రామ సర్పంచ్ స్వేత క్రిష్ణ చైతన్య అన్నారుబాధిత కుటుం బానికి ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కుని పంపిణీ చేసే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్వేత క్రిష్ణ చైతన్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన లో పేదలకు అండగా ఉండాలని దేశంలోనే అత్యధికంగా ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి చెక్కులను పంపి ణీ చేసి పేదలకు ఆసరా గా నిలుస్తుందని వారు అన్నారు..చెన్నారావుపేట మండల కేంద్రం లో దొంతి మాధవ రెడ్డి గారి ఆదేశాల మేరకు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులని ఉప సర్పం చ్ దొంతి శ్రీను కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేసారు.. మం డల కేంద్రానికి చెందిన కోరె కార్తీక్ కి రూ.1 లక్ష రూపాయలు తాల్లపెల్లి నర్సయ్య గౌడ్ రూ.16 వేలు ముదురుకోళ్ల రజిత రూ.23 వేలు చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారి సహకారంతో బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 1 లక్ష 39 వేల రూపాయల చెక్కులని అందించారు..ఈ కార్యక్రమంలో కుండే కుమార స్వామి మెంతు ల రమేష్ వార్డు సభ్యు లు యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షు డు లక్క రాజు మాచర్ల ఎల్లా గౌడ్ ఈసంపెల్లి ఐలయ్య కొమ్ముల పూలమ్మ ఎడ్ల రాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలి: ట్రాఫిక్ సిఐ కృష్ణ



యాదగిరిగుట్ట, మార్చి 23 (పోలీస్ నిఘా) : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశుఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా యాదగిరిగుట్ట ట్రాఫిక్ పిఎస్ పరిధిలో వంగపల్లి, పెద్ద కందుకూరు, ఆలేరు, మోటకొండూరు పరిధిలో హెల్మెట్ లేకుండా ఎన్ హెచ్ 163 హైవే ఎక్కే వాహనాలకు స్పెషల్ గా కౌన్సిలింగ్ చేయించి, అవసరమైన వాళ్లకి హెల్మెట్ కొనిపించి, హెల్మెట్ ధరించని వాళ్లకు ఫైన్లు విధించడం జరిగింది. వరంగల్ హైవే మీద టూ వీలర్స్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ స్ ధరించాలని లేనియెడల ఇకమీదట కచ్చితంగా ఫైన్లు విధించడం జరుగుతుందని స్థానిక యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ ఎలగొండ కృష్ణ తెలిపినారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల తలకు గాయాల తీవ్రత తగ్గుతుందని హాస్పటల్లో అయ్యే బిల్లు కూడా తగ్గుతుందని తెలిపినారు. సోమవారం యాదగిరిగుట్ట ట్రాఫిక్ పిఎస్ పరిధిలో 36 హెల్మెట్లు కొనిపించడం,అదేవిధంగా హెల్మెట్ ధరించని వాహనదారులకు 44 ఫైన్స్ విధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, ఆర్ఎస్ఐ రాజు, కానిస్టేబుళ్లు కోటి సురేష్ నితిన్ సైదులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఖమ్మం భూదాన్ భూముల కేసులో మరో నలుగురు కీలక నిందుతులు అరెస్ట్

ఖమ్మం, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూ ప్రాంతంలోని భూదాన్, ప్రభుత్వ భూములపై అక్రమ వ్యాపారాలకు, ఆక్రమణలకు పాల్పడిన వారి పై Cr. No. 101/2026, U/S 111 (1) (ii), 318(4) r/w 3(5) of BNS 2023 క్రింద గతంలో ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసులో మరో నలుగురు కీలక నిందుతులైన 1.కల్తీ రామచంద్రయ్య 2. బాణాల లక్ష్మణ చారి 3. చిప్పనపల్లి వీరయ్య 4. కుంజా కృష్ణయ్య ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఆయా కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిదంగా ఈ కేసు లో ప్రధాన నిందుతులైన 1) పోలెబోయిన ముత్తయ్య, 2)బల్లి శ్రీనివాస్, 3)కొప్పెర వెంకన్న, 4)కొట్టే బసు,5) సంపంగి వెంకటాచలం, లను మెజిస్ట్రేట్ అనుమతి తో పోలీస్ కస్టడీపై తీసుకొచ్చి విచారించిన అనంతరం సోమవారం తిరిగి జ్యుడీషియల్ రిమాండుకు తరలించడం జరిగిందని అన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పదహారు (16) మంది నిందుతులను అరెస్ట్ చేయడం జరిగిందని, నిందుతుల అక్రమ అస్తులను గుర్తించి వాటిని చట్ట ప్రకారంగా స్వాధీనం పర్చుకొనుటకు ప్రక్రియ కొనసాగుతుందని ఏసీపీ తెలిపారు.



## కాంగ్రెస్ పాలన ప్రజా వ్యతిరేకం: రచ్చ శ్రీనివాస్



యాదగిరిగుట్ట, మార్చి 23 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలనతో తెలంగాణను దెబ్బతీస్తోందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టిన సందర్భంగా సోమవారం యాదగిరి గుట్టలో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేసి, అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి భయపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో బీజేపీ నాయకులు భయపడరని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, పేదల జీవన స్థితిని మరింత దెబ్బతీస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి, పాలనకు ముగింపు పలుకుతారని ధీమా వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణిచివేయలేరని, ప్రజల కోసం పనిచేయడంలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ అరెస్టుల్లో పట్టణ అధ్యక్షుడు కర్ర ప్రవీణ్, రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యుడు గుంటుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

## రాజీతో సమస్యను పరిష్కరించుకోండి

### -వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్-



వరంగల్, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఈ నెల 28వ తేది జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. సీపీ ఓ ప్రకటన చేస్తూ ఈ నెల 28, శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుం బపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

### - జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా-



పరిగి, మార్చి 23 (పోలీస్ నిఘా) : 2016 సంవత్సరం లో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కారాగార శిక్ష , 12000 రూపాయల విధిస్తూ తీర్పునిచ్చిందని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. పరిగి మండలం, బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య (37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం మరియు బెదిరింపులకు (ఐపిసి సెక్షన్లు 376, 506) సంబంధించి కేసు (సిఆర్ నెం: 268/2016) నమోదైంది. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కొనసాగింది. పోలీసులు సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ చౌదరి చంద్ర కిషోర్ గారు, నిందితుడు అంజయ్య దోషిగా నిర్ధారిస్తూ 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 12,000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విశేష కృషి చేసిన అధికారులను ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వై. నాగేష్ (అప్పటి పరిగి ఎస్ఐ), పి. ప్రసాద్ (అప్పటి పరిగి సిఐ ), ప్రస్తుత పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్. హెచ్. ఓ మోహన్ కృష్ణలను , అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పి.పి. శ్రీమతి మెరాజ్ ఫిర్దౌస్, సి.డి.ఓ జగన్ మోహన్ రెడ్డి, మరియు కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్. నిరంజన్ గౌడ్ ల పనితీరును ఎస్పీ గారు ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

## రవాణా శాఖ - మోటార్ వాహనాలు వేలం నోటీసు



రంగారెడ్డి, మార్చి 23 (పోలీస్ నిఘా) : రవాణా శాఖ - మోటార్ వాహనాలు వేలం నోటీసు - ఆర్టీసీ డిపోలో ఉన్న వాహనాలు - ఆర్టీసీ రంగారెడ్డి పరిధి విస్తృత ప్రచారం కోసం వార్తాపత్రికలలో ప్రచురించవలసిందిగా కోరుతూ సంబంధించి. ఆర్టీసీ రంగారెడ్డి పరిధిలోకి వచ్చే వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించాలని మేము భావిస్తున్నాము. దీనికి సంబంధించి, ఈ క్రింద పేర్కొన్న వేలం నోటీసును అన్ని వార్తాపత్రికలలో ప్రచురించడానికి తగిన ఏర్పాటు చేయవలసిందిగా మీ కార్యాలయాన్ని కోరుతున్నాము. ఖీఅ డిపోలో పెద్ద సంఖ్యలో వాహనాలు సుదీర్ఘకాలంగా ఉండటం వల్ల పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి, కాబట్టి దీనికి విస్తృత ప్రచారం అవసరం. "జాబితాలో పేర్కొన్న వాహనాల రిజిస్టర్డ్ యజమానులు/ స్వాధీనంలో ఉన్న వ్యక్తులు లేదా ఫైనాన్సియర్లు, సంబంధిత అధికారి నుండి 27-03-2026 లోపు లేదా అంతకంటే ముందుగా వాహన విడుదల ఉత్తర్వులను పొందవలసిందిగా దీని ద్వారా తెలియజేయడమైనది. అలా చేయని పక్షంలో, జతచేయబడిన జాబితాలోని వాహనాలు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా బహిరంగ వేలంలో విక్రయించబడతాయి." ఈ విషయంలో మీ సహకారం మరియు మద్దతుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము.

# జర్నలిస్టులపై దాడి సమాజానికి ప్రమాదం



**జర్నలిస్టులపై దాడికి పాల్పడినవారిని రిమాండ్ చెయ్యాలి**

**చేవెళ్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన ఎం.జే.ఎఫ్ నాయకులు**

**రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసుల జాప్యం**

**జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి**

**ఎంజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి**

చేవెళ్ల, మార్చి 23 (పోలీస్ నిఘా) : షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఎంజేఎఫ్ మాదిగ జర్నలిస్ట్ ఫోరం. చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి. జర్నలిస్టులతో కలిసి చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే కలం సైనికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, సమాజంపై ఉందని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించే రిపోర్టర్లపై భౌతిక దాడులు, బెదిరింపులు, ఆన్‌లైన్ వేధింపులు పెరిగిపోతున్నాయని, ఇదే కోణంలో షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై దాడి జరిగిందని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి 20 రోజులు కావస్తున్న నిందితులను రిమాండ్ చెయ్యకుండా రాజకీయనాయకులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అధికారులు కేసు పురోగతిలో కాలయాపన చేస్తుండటంతో నిందితులు సాక్షులను, ఆధారలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. అంతే కాకుండ విధినిర్వహణలో ఎన్నో కష్టాలకోర్చి అనేక వాస్తవిక స్థితిగతుల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే జర్నలిస్టులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుంది. కానీ అదేస్థాయిలో వారు ఎన్నో ఒత్తిళ్లను తట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి నిగ్గు తేల్చే నిజాలను ప్రజల ముందుంచుతారు. అలాంటి జర్నలిస్టులపై బెదిరింపులు, నిర్బంధాలు, దాడులు, అపహరణ, హత్యలు లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి దాడులను ప్రతి ఒక జర్నలిస్టు ఖండించి, మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కో. కన్వీనర్ నర్సాని రమేష్, జర్నలిస్టులు నరేందర్, అమర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి నాయక్ తండాలో సిసి రోడ్ పనులు ప్రారంభం

**మండల అధ్యక్షుడు సిద్దన రమేష్**

**గ్రామ సర్పంచ్ జాటోత్ పట్నీ**



చెన్నారావుపేట, మార్చి 23 (పోలీస్ నిఘా) : సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ జాటోత్ పట్నీ లు అన్నారు. చెన్నరావుపేట మండలం అమీనాబాద్ పత్తినాయక్ తండాలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో ఎన్ఆర్ఈ జిఎస్ నిధులు 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టా రు.. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ జాటోత్ పట్నీ లు కొబ్బరికాయ కొట్టి పనులని ప్రారంభిం చారు.. ఈ సందర్భంగా గ్రామ అభి వృద్దే లక్ష్యం గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మె ల్యే దొంతి సహకారంతో చేపడుతమని మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాల అబి వృద్ధి కాంగ్రెస్ ప్రభు త్వం తోనే సాధ్యమని గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని జీవో లేని రోడ్లు మంజూరి చేసి ప్రజలను ఇబ్బందు లకు గురి చేసిందని ప్రజా ప్రభుత్వం చెప్పిందే చేస్తుందని చేసేదే చెప్తుం దని ఆయన అన్నారు.. గ్రామ సర్పంచ్ పట్నీ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో గ్రామాల అబి వృద్ధి కుంటు పడిం దని ప్రజా పాలనలో తండా లు గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని సర్పంచ్ అన్నారు.. ఈ కార్యక్ర మంలో మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ జిల్లా కార్యదర్శి మోగిలి వెంకట్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్ ఆయా గ్రామాల సర్పంచ్ దారా రంజిత్, భూక్య లావణ్య హనుమా, ఉప సర్పంచ్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, మాజి సర్పంచ్ స్వామి నాయక్, దారావత్ రాములు నాయక్, ఉప సర్పంచ్ శక్రు నాయక్ పత్తినాయక్ తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రవి నాయక్ వార్డు మెంబర్స్, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల ఉప సర్పంచ్లు ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

# పార్టీలో అవమానాలు భరించలేకపోతున్నా

### 30వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్త చట్టు మంగ ఆవేదన

### మీడియా సాక్షిగా తన గోడు వెళ్లబోసుకున్న బాధితురాలు



ఖమ్మం, మార్చి 23 (పోలీస్ నిఘా) : పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న తనను ఒక మహిళనని చూడకుండా కించపరుస్తున్నారని, రాజకీయాలెందుకంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని 30వ డివిజన్ మహిళా కాంగ్రెస్ కార్యకర్త చట్టు మంగ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తనపై జరుగుతున్న వేధింపులను వివరించారు. ఈ నెల 21వ తేదీన డివిజన్ పరిధిలో బూత్ లెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఆ సమయంలో పార్టీకి చెందిన బొమ్మ ఉదయ్ అనే వ్యక్తి తనను ఉద్దేశించి "నీకు రాజకీయాలతో పనేంటి? ఇంట్లో ఉండి పిల్లల్ని చూసుకోవాలి కదా" అంటూ అసభ్యంగా మాట్లాడారని ఆమె ఆరోపించారు. గతంలోనూ నాలుగైదు సార్లు ఇలాగే కించపరిచారని, ఈ విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లినా సదరు వ్యక్తి తీరులో మార్పు రాలేదని పేర్కొన్నారు. "నేను నిన్నగాక మొన్న రాజకీయాల్లోకి రాలేదు. 1997 నుంచి గాంధీనగర్ ప్రాంతంలో పార్టీ బలోపేతం కోసం ఒక కార్యకర్తగా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాను. తుమ్మల నాగేశ్వరరావు , పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నా పనితీరు తెలుసు. ఎప్పుడూ పదవుల కోసం ఆరాటపడలేదు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంటే, క్షేత్రస్థాయిలో ఇలాంటి అణచివేత చర్యలు బాధాకరం" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్యకర్తలకు గౌరవం దక్కాలని, తనను దూషించిన వ్యక్తిపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## బాల్య వివాహాల నిరోధక చట్టం గోడ ప్రతులను ఆవిష్కరించిన కలెక్టర్



హనుమకొండ , మార్చి 23 (పోలీస్ నిఘా) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం-2006కు సంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆవిష్కరించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో, మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా "బేటీ బచావో - బేటీ పఢావో" కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక అధికారులుగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ/సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, మండల స్థాయిలో తహశీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సీఎంపీవోగా వ్యవహరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీను, పరకాల మరియు హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ విశ్వజ, జీఈసీఓ సునీత, ఈఓ సింధు రాణి, మిషన్ కోఆర్డినేటర్లు కళ్యాణి, పావని తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మల లక్ష్మీనరసిం హస్వామి వారిని దర్శించుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



వరంగల్ నర్సంపేట గీసుగొండ , మార్చి 23 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గీసుగొం డ మండలంలో కొమ్మ లలక్ష్మీనరసింహస్వామి వారిని నేడు నర్సంపేట నియోజకవర్గ శాసనస భ్యులు పెద్దలు దొంతి మాధవరెడ్డి వారి సతీమ ణి దొంతి శాలి నిరెడ్డి , వారి కూతురు దొంతి అన న్యరెడ్డి దర్శించు కున్నారు.. ఈసందర్భంగా ఎమ్మె ల్యే గారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి వేద ఆశీర్వాదాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లా డుతూ నర్సం పేట నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.

## వడ్డెర్ల ఆత్మగౌరవం కోసం నేడు 'అసెంబ్లీ ముట్టడి

### 48 ఏళ్లుగా మా పోరాటం సాగుతున్నా పట్టించుకోని పాలకులు: ఇరగదిండ్ల కృష్ణ ఆవేదన



దేవరకొండ, మార్చి 23 (పోలీస్ నిఘా) : వడ్డెర్ల ఆత్మగౌరవం మరియు వారి న్యాయమైన హక్కుల సాధన కోసం రేపు, మార్చి 24 (మంగళవారం) ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా దేవరకొండ వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2023 ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 'వడ్డెర కార్పొరేషన్'ను వెంటనే ఏర్పాటు చేయాలి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వంద మంది ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడం శోచనీయం. ఇది ఈరోజు మొదలైన పోరాటం కాదు. గత 48 ఏళ్లుగా మా జాతి హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నాం. ఏ ప్రభుత్వం వచ్చినా వడ్డెర్లను ఓటు బ్యాంకులానే చూస్తున్నాయి తప్ప, మా బతుకుల్లో వెలుగు నింపే ప్రయత్నం చేయడం లేదు. న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. గ్రామాలు, పట్టణాలు మరియు జిల్లా కేంద్రాల నుండి రాష్ట్ర స్థాయి వరకు నిరంతరంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతాము. వడ్డెర కులస్తులందరూ ఈ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొని, మన ఆత్మగౌరవ గళాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

## నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

### -24న దేవరకొండలో జాబ్ మేళా-



దేవరకొండ , మార్చి 23 (పోలీస్ నిఘా) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు స్థానిక ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఈ నెల 24న భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి తెలిపారు. ప్రముఖ ఫార్మా సంస్థ ఎం.ఎస్.ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 'ప్రొడక్షన్ ట్రైనీ' పోస్టుల భర్తీ కోసం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (TSKC) సహకారంతో ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్ మేళా మార్చి 24, 2026న ఉదయం 9:30 గంటలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడుతుంది. ఎంపిక ప్రక్రియలో వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ఉంటాయి. డిగ్రీ (B.Sc. కెమిస్ట్రీ, B.A., B.Com.) మరియు ఇంటర్మీడియట్ (MPC, BiPC, MLT//ఫార్మా బ్రిడ్జ్ కోర్స్) అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2022 నుంచి 2025 మధ్య ఉత్తీర్ణులైన వారు, అలాగే 2026లో ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులు. అభ్యర్థుల వయస్సు 17 నుంచి 22 సంవత్సరాల మధ్య ఉండాలి. ఈ అవకాశాన్ని కేవలం పురుష అభ్యర్థులకు మాత్రమే పరిమితం చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,000 వేతనం, ఒక సంవత్సరం పాటు ఉచిత హాస్టల్ వసతి, బస్సు సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు డే, నైట్ షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు, రిజల్ట్స్ ట్రూ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే ఉదయం 9 నుంచి 10 గంటల లోపు అప్లై చేయని వారు కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమావత్ రవి కోరారు. మరిన్ని వివరాలకు 9703802151, 9491622900 నంబర్లను సంప్రదించవచ్చు.

## పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



యాదగిరిగుట్ట, మార్చి 23 (పోలీస్ నిఘా) : పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పేర్కొన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో చేపట్టిన నిర్వహణ ఏర్పాట్లు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అలాగే పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాలను పోలీస్ బందోబస్తుతో సురక్షితంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక రక్షణ అవసరం

**-అసెంబ్లీలో బీర్ల అయిలయ్య డిమాండ్-**



యాదగిరిగుట్ట, మార్చి 23 (పోలీస్ నిఘా) : గిగ్ ఎకానమీలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీర్ల అయిలయ్య అసెంబ్లీలో ప్రస్తావించారు. సాంకేతిక విప్లవంతో పెరుగుతున్న ఈ రంగంలో వేలాది మంది యువకులు ఉపాధి పొందుతున్నప్పటికీ, వారికి సరైన భద్రత లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఉబర్, ఓలా, స్విగ్గి , జొమాటో వంటి సంస్థల ద్వారా సేవలు అందిస్తున్న గిగ్ వర్కర్లు ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ, వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాదాలు జరిగినప్పుడు సరైన సహాయం అందకపోవడం తీవ్ర సమస్యగా మారిందని చెప్పారు. ఆరోగ్య భీమా, ప్రమాద భీమా, పెన్షన్ వంటి కనీస సామాజిక భద్రతా సదుపాయాలు కూడా గిగ్ వర్కర్లకు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. గిగ్ వర్కర్లను కేవలం 'పార్ట్‌నర్స్'గా కాకుండా కార్మికులుగా గుర్తించి, వారికి వర్తించేలా ప్రత్యేక విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ అసంఘటిత రంగ కార్మికుల కష్టాన్ని గుర్తించి, వారి భవిష్యత్తు భద్రంగా ఉండేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల వాటా పెంచాలి

**-రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్-**



సంగారెడ్డి, మార్చి 23 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2026 బి 27 బడ్జెట్లో బీసీలకు జనాభా ప్రాతిపదంగా కేటాయింపులు జరగలేదని బడ్జెట్ను పెంచాలని డిమాండ్ చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం .. సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ అధ్యక్షతన సమావేశం జరిగినది ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ప్రభు గౌడ్ గారు మాట్లాడుతూ. జనాభాలో 56% పైగా ఉన్న బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కల్పించలేదు అలాగే ఉన్న ప్రకటించిన బడ్జెట్ లో కూడా బీసీలకు కేవలం నాలుగు శాతం నిధులను కేటాయించడం అన్యాయమని అన్నారు మరియు కనీసం 25 వేల కోట్ల రూపాయలు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు. మరియు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తొందర్లో అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి కృష్ణ జిల్లా ఉపఅధ్యక్షులు కావేరి ఆంజనేయులు ముఖ్య సలహాదారులు చంద్రయ్య స్వామి కార్యదర్శులు సుధాకర్ గౌడ్ శ్రీనివాస్ పాండురంగం జిల్లా నాయకులు జగ్గా సింగ్ డి యాదన్న మహిళా అధికార ప్రతినిధి మంగ గౌడ్ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు లతానాయి బ్రాహ్మణ సంఘం జిల్లాఅధ్యక్షులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా ఏర్పాటు చేస్తున్నాం: సీపీ సజ్జనార్

(మొదటి పేజీ తరువాయి)

శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వాహకులు శ్రీ భగవంతరావు, శ్రీ గోవింద్ రాఠి, శ్రీ ఆనంద్ సింగ్, శ్రీ కృష్ణ, శ్రీమతి శశికల (మాజీ కార్పొరేటర్), శ్రీ లాల్ సింగ్ (మాజీ కార్పొరేటర్) అందరూ శోభాయాత్ర సందర్భంలో ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించగా.. దీనిపై సీపీ స్పందిస్తూ అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శోభాయాత్ర వెళ్లే రూట్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి సీపీ గారు పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీ శ్రీ తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, ఐపీఎస్, శ్రీమతి ఎన్. శ్వేత, ఐపీఎస్, జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చిత్రం

## సీనియర్ హీరోల డైలమా పెద్ద ప్రాబ్లమే!



బాలీవుడ్ వెండితెరను దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన ఖాన్ త్రయం షారుఖ్, సల్మాన్, అమీర్ ఖాన్. ప్రస్తుతం ఈ ముగ్గురు అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వీరి పేరు చెబితే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిసేది. కానీ మారుతున్న ప్రేక్షకుల అభిరుచుల దృష్ట్యా ఇప్పుడు సరైన జానర్‌ను ఎంచుకోవడంలో తీవ్రమైన డైలమాలో పడుతున్నారు. వరుస ఫెయిల్యూర్స్ లేదా లాంగ్ బ్రేక్స్ తీసుకోవడం వల్ల బాలీవుడ్‌లో ఖాన్ల శకం ముగిసిందా? అన్న చర్చా లేకపోలేదు.

షారుఖ్ ఖాన్ విషయానికొస్తే పఠాన్, జవాన్ వంటి చిత్రాలతో భారీ విజయాలను అందుకున్నప్పటికీ, ఆ తర్వాత మళ్లీ తనదైన మార్క్ కథలను ఎంచుకోవడంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మరోవైపు అమీర్ ఖాన్ లాల్ సింగ్ చడ్డా పరాజయం తర్వాత సుదీర్ఘ విరామం తీసుకున్నారు. కంటెంట్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండే అమీర్ సైతం ఇప్పుడున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా ఏ కథతో రావాలో తెలియక సతమతమవుతున్నట్లు కనిపిస్తోంది. వీరిద్దరి పరిస్థితి ఇలా ఉంటే సల్మాన్ ఖాన్ తన రెగ్యులర్ మాస్ ఫార్ములా చిత్రాలతో ఆశించిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ప్రేక్షకులు కేవలం స్టార్ ఇమేజ్‌ను చూసి థియేటర్లకు రావడం లేదు. సౌత్ ఇండియా నుంచి రిలీజ్ అయిన పుష్ప, ఆర్‌ఆర్‌ఆర్, కేజీఎఫ్ వంటి చిత్రాలు బాలీవుడ్ మార్కెట్‌ను శాషించడంతో ఖాన్ హీరోలకు గట్టి పోటీ ఎదురవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో భారీ యాక్షన్ డ్రామాలు లేదా వెరైటీ కాన్సెప్ట్‌లు ఉంటేనే జనాలు ఆదరిస్తున్నారు. ఈ క్రమంలో పాతకాలపు రొమాంటిక్ , రొటీన్ మాస్ కథలనే నమ్ముకోవడం వల్ల వీరి మార్కెట్ దెబ్బతింటోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వరుసగా ఎదురవుతోన్న పరాజయాలు , సినిమాల మధ్య పెరిగిన గ్యాప్ కారణంగా బాలీవుడ్ జనాలు కొత్త తరం హీరోల వైపు మొగ్గు చూపుతున్నారు. రణబీర్ కపూర్, రణవీర్ సింగ్ వంటి యువ హీరోలు వైవిధ్యమైన పాత్రలతో దూసుకుపోతుండటంతో సీనియర్ల హవా తగ్గుతోందనేది వాస్తవం. 50 ఏళ్లు పైబడిన ఈ హీరోలు ఇంకా యువకుల్లాగే రొమాంటిక్ పాత్రలు చేయడం కంటే తమ వయసుకు తగ్గట్టుగా అమితాబ్ బచ్చన్ తరహాలో పవర్‌ఫుల్ క్యారెక్టర్ రోల్స్ లేదా సీరియస్ డ్రామాల వైపు వెళ్లాలని సోషల్ మీడియాలో కామెంట్స్ లేకపోలేదు. అయితే వీరి శకం ముగిసిందని ఇప్పుడే చెప్పడం తొందరపాటే అవుతుంది. ఎందుకంటే ఖాన్ హీరోలకు ఉన్న ఫ్యాన్ బేస్ అంతర్జాతీయ స్థాయిలో ఉంది. ఒక్క సరైన హిట్ పడితే మళ్లీ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయగల సత్తా వీరికి ఉంది. ప్రస్తుతం వీరు ఎదుర్కొంటున్న ఈ డైలమా కేవలం తాత్కాలికమే. సరైన దర్శకుడు బలమైన కథ దొరికితే మళ్లీ విశ్వరూపం చూపిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఖాన్ త్రయం తమ ఇమేజ్‌ను కాపాడుకోవాలంటే ప్రస్తుత పాన్-ఇండియా ట్రెండ్‌ను అర్థం చేసుకుని ముందుకు సాగాలి. కంటెంట్ పరంగా రాజీ పడకుండా, కొత్త దర్శకులతో ప్రయోగాలు చేస్తేనే వారు మళ్లీ ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మళ్లీ ఖాన్ల గర్జన వినిపించాలంటే వారు తమ పాత ఫార్ములాలను వీడి కొత్త బాట పట్టక తప్పదు. మరి రాబోయే రోజుల్లో వీరు ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటారో చూడాలి.

## సందీప్ కిషన్.. ట్రాక్ మార్చినట్లు ఉన్నారే..



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ సందీప్ కిషన్ కెరీర్ లో కనపడుతున్న బిగ్ ఛేంజ్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఒకప్పుడు వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, మధ్యలో కొంత స్లో అయినప్పటికీ ఇప్పుడు సరైన ప్లాన్ తో సెకండ్ ఇన్నింగ్స్ ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కంటెంట్ కు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంచుకుంటూ, తన ట్రాక్ ను పూర్తిగా మార్చినట్లుగా కనిపిస్తోంది. ఇటీవల మంచి విజయం సాధించిన శంబాల చిత్ర దర్శకుడు ఉగంధర్ మునితో సందీప్ కిషన్ చేతులు కలపడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఆ కాంబినేషన్ లో సోషియో-ఫాంటసీ జానర్ లో ఓ భారీ చిత్రం రూపొందనుంది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించింది. ఆ చిత్రాన్ని నిర్మాతలు రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించనుండగా.. కంటెంట్ పరంగా స్ట్రాంగ్ కథతో రానుందని టాక్. అదే సమయంలో సందీప్ కిషన్ లైనప్ లో ఉన్న మరో ఆసక్తికర ప్రాజెక్ట్ పవర్ పేట. ఆ చిత్రాన్ని కృష్ణ చైతన్య తెరకెక్కించనున్నారు. రౌడీ ఫెలో, చల్ మోహన్ రంగ, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి వంటి చిత్రాలతో తనదైన టాలెంట్ ను ప్రూవ్ చేసుకున్న కృష్ణ చైతన్య.. స్ట్రాంగ్ కంటెంట్ తో సినిమాలు తీసే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. దీంతో పవర్ పేటపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న సిగ్మా ప్రాజెక్ట్ కూడా సందీప్ కిషన్ కెరీర్ లో ప్రత్యేకంగా నిలిచే అవకాశం ఉంది. ఆ చిత్రానికి దళపతి విజయ్ కొడుకు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టైలిష్ యాక్షన్ హీస్ట్ థ్రిల్లర్ గా రానున్న ఆ సినిమా 2026 వేసవిలో విడుదల కానుందని సమాచారం. సందీప్ ఇలాంటి జోనర్ లో నటించడం తొలిసారని తెలుస్తుండడంతో మంచి అంచనాలు నెలకొన్నాయి. అలా వరుసగా భిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న సందీప్ కిషన్, కెరీర్ లో కొత్త ట్రాక్ ను ఎంచుకున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఒకే తరహా పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్న జోనర్లలో తన టాలెంట్ చూపించాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. గతంలో స్నేహగీతం, ప్రస్థానం వంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన సందీప్ కిషన్, కెరీర్ ప్రారంభంలోనే మంచి నటుడిగా గుర్తింపు పొందారు. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, తెనాలి రామకృష్ణ బీఏ బీఎల్ వంటి సినిమాలతో విజయాలు అందుకున్నప్పటికీ, మధ్యలో కొన్ని చిత్రాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. అయితే ఇప్పుడు కథల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సందీప్ కిషన్, మళ్లీ విజయాల బాట పట్టేలా కనిపిస్తున్నారు. మొత్తానికి కంటెంట్ కు ప్రాధాన్యం ఇస్తూ, కొత్త తరహా కథలను ఎంచుకుంటున్న సందీప్ కిషన్.. సెకండ్ ఇన్నింగ్స్ లో గట్టిగా సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. మరి చూడాలి ఏం జరుగుతుందో..

## మృణాల్ కెరీర్ మలుపు తిరగనుందా?



టాలీవుడ్‌లో ఒక్క సినిమాతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించడం చాలా అరుదు. అలాంటి ఛాన్స్‌ను అందుకున్న అతి తక్కువ మంది హీరోయిన్స్‌లో మృణాల్ ఠాకూర్ ఒకరు. సింపుల్ లుక్స్, నేచురల్ యాక్టింగ్ తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె, ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్ గా మారింది. హిందీ టెలివిజన్ సీరియల్స్ తో కెరీర్ ప్రారంభించిన మృణాల్, మొదట బాలీవుడ్ లో అవకాశాలు దక్కించుకున్నప్పటికీ, అక్కడ పెద్దగా గుర్తింపు రాలేదు. అయితే ఆమె అదృష్టం టాలీవుడ్ తలుపు తట్టిన తర్వాత కెరీర్ పూర్తిగా మారిపోయింది. సీతారామం సినిమాలో దుల్కర్ సల్మాన్ సరసన చేసిన రోల్.. ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ సినిమాలో ఆమె యాక్టింగ్ ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ మూవీ విజయాన్ని కొనసాగిస్తూ నానితో కలిసి చేసిన హాయ్ నాన్న కూడా రెస్పాన్స్ తెచ్చుకుంది. ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే కథలో మృణాల్ మరోసారి తన నటనతో మెప్పించారు. కానీ విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ మాత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. కానీ ఇప్పుడు మృణాల్ ముందున్న టాలీవుడ్ ప్రాజెక్టులు అందరి దృష్టి ఆకర్షిస్తున్నాయి. అడివి శేష్ తో కలిసి నటిస్తున్న డెకాయిట్ మూవీ.. యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఆ సినిమాలో ఆమె పాత్ర ఇప్పటివరకు చూసిన మృణాల్ కు భిన్నంగా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఆ చిత్రం సక్సెస్ అయితే, ఆమెకు యాక్షన్ జానర్ లో కూడా అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రంలో మృణాల్ నటిస్తున్నారని వార్తలు కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. అధికారిక ప్రకటన రాకపోయినా, అది నిజమైతే ఆమె కెరీర్ లో మరో పెద్ద అవకాశంగా మారనుంది. అదే సమయంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలోని స్పెషల్ సాంగ్ లో మృణాల్ కనిపించనుందని టాక్ వినిపిస్తోంది. ఆ పాటలో జాన్వీ కపూర్ కూడా భాగమవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. భారీ సెట్స్, మాస్ బీట్ తో తెరకెక్కే ఆ పాట సినిమాకే హైలెట్ అవుతుందని సమాచారం. త్వరలోనే మేకర్స్ అఫీషియల్ గా ఆ విషయాన్ని అనౌన్స్ చేయనున్నారట. అదే నిజమైతే మృణాల్ కు మరో పెద్ద ఛాన్స్ అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అలా వరుస అప్డేట్లను చూస్తుంటే మృణాల్ తన కెరీర్ ను కొత్త దిశలో తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. కేవలం నటనతోనే కాకుండా.. గ్లామర్, కమర్షియల్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ మృణాల్ ఠాకూర్ కెరీర్ లో ముందుకు సాగుతున్నారని చెప్పాలి. ఏదేమైనా సరైన ప్రాజెక్టులు, స్టార్ కాంబినేషన్లలో చేస్తున్న సినిమాలు కలిసి వస్తే.. అదే భారీగా హిట్లు అయితే మృణాల్ ఠాకూర్ కెరీర్ మలుపు తిరిగే అవకాశం ఉందనే చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## మల్టీస్టారర్‌లో మరో భామగా కయాదు లోహార్!



టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తనదైన మార్క్ ఎంటర్టైన్మెంట్ కోసం మరో భారీ మల్టీస్టారర్ సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోలుగా విక్టరీ వెంకటేష్.. నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. ఇద్దరు చేతులు కలపడం ఇదే తొలిసారి కావడంతో ఆ కాంబినేషన్ లో సినిమా ఎలా ఉంటుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనీల్ కథతో పాటు ఆ కథలో పాత్ర ధారులపై దృష్టి పెట్టాడు. ఇప్పటికే వెంకటేష్‌కు జోడీగా అభినేత్రి కీర్తి సురేష్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఇద్దరు ఇంత వరకూ జోడీ కట్టలేదు. అనీల్ అందుకు ఛాన్స్ తీసుకున్నాడు. సీనియర్ హీరోలకు కీర్తి ఇప్పుడు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ చెప్పొచ్చు. దీంతో వెంకీ-కీర్తి మధ్య కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుందని భావిస్తున్నారంతా. దీంతో కల్యాణ్ రామ్ సరసన ఛాన్స్ అందుకునే నటి ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారిన తరుణంలో ఓ క్రేజీ బ్యూటీ పేరు తెరపైకి వచ్చింది. అనీల్ అనిల్ రావిపూడి హాట్ బ్యూటీ కయాదు లోహార్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కయాదు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 'అల్లూరి' వంటి చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమైంది. అటుపై 'డ్రాగన్' తో కుర్రాళ్లలో క్రేజీ బ్యూటీ మారిపోయింది. ఆ విజయం అమ్మడికి మంచి ఫాలోయింగ్ తెచ్చి పెట్టింది. దీంతో 'ఫంకీ', ' ది ప్యారడైజ్' లాంటి చిత్రాల్లో ఛాన్సులందుకుంది. 'ఫంకీ' నిరాశపరిచినా? ప్యారడైజ్ పై మాత్రం భారీ అంచనాలే ఉన్నాయి. ఇతర భాషల్లోనూ బిజీగా మారింది. అనీల్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే? సాధారణంగా అనీల్ సినిమాల్లో హీరోయిన్లకు కూడా ప్రాధాన్యత ఉండేలా పాత్రలను డిజైన్ చేస్తాడు. ఈ మల్టీస్టారర్‌లో కయాదు లోహార్ పాత్ర చాలా రిఫ్రెషింగ్‌గా ఉంటుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్ గంభీరమైన పాత్రకు ఈమె పాత్ర చక్కగా సెట్ అవుతుందని అనీల్ బలంగా నమ్ముతున్నాడుట. ప్రస్తుతం కయాదు లోహార్ పేరు చర్చల దశలోనే ఉంది. కానీ ఖరారు అవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోర్సెస్ ద్వారా తెలిసింది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ మల్టీస్టారర్ కూడా ప్రధానంగా కామెడీ , ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ తిరుగుతుందని వినిపిస్తోంది.. కళ్యాణ్ రామ్ ఒక కొత్త లుక్‌లో, కాస్త ఫన్ జోనర్‌లో కనిపించబోతున్నారని టాక్. అనీల్ కు బాగా కలిసొచ్చిన జానర్ ఇది. కథ విషయంలో అనీల్ ఎప్పుడూ నేల విడిచి సాము చేయడు. పాత కథనే కొత్త ట్రీట్ మెంట్ తో చెప్పడం అలవాటు. అతడి విజయ రహస్యం కూడా అదే.

## హామీలను విస్మరించినందునే అసెంబ్లీ ముట్టడి: రామచందర్‌రావు



హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 26 నెలలు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఈరోజు బీజేపీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. అసెంబ్లీ ముట్టడి అనంతరం మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా గ్యారంటీలన్నింటినీ పక్కనబెట్టి అమలు చేసినట్లు ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు, యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక డిక్లరేషన్లు విడుదల చేసి లక్షలాది కుటుంబాలను నమ్మించిందని, అధికారంలోకి వచ్చాక వాటి అమలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రైతులకు ఇంకా రైతు భరోసా కింద ఎకరానికి రూ.45,000 వరకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని, దాదాపు రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్లు, మహిళల పెన్షన్లు, రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. తాము ఎన్నిసార్లు లేఖలు రాసినా ప్రభుత్వం స్పందించడం లేదని, ఈ పరిస్థితుల్లో ప్రజల తరఫున ప్రశ్నించడానికి, వారి వాణిని వినిపించడానికి బీజేపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి చేపట్టామని చెప్పారు. తమను అసెంబ్లీ వద్ద అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమన్నారు. దాదాపు తొమ్మిది పోలీస్ స్టేషన్లలో 800మందికిపైగా కార్యకర్తలను అందులో 150మంది మహిళలు, యువమోర్చా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. అర్ధరాత్రి నుంచే తమ నాయకులను గృహ నిర్బంధం చేశారంటూ వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వేలాది కార్యకర్తలను మార్గమధ్యంలోనే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రామచందర్‌రావు హెచ్చరించారు. గ్యారంటీలు, హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు
# ఏమయ్యాయి?

### పెండింగ్ డీఏలు ఎప్పటిలోగా చెల్లిస్తారు?
### అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీశిన హరీష్‌రావు



హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఎన్నికల ముందు ఆర్టీసీ ఉద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక గాలికొదిలేసిందని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంస్థ మనుగడపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మొన్నటి గవర్నర్ ప్రసంగంలో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల రూ.9,200 కోట్లు ఆదా అయిందని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. మరి ఆ రూ.9,200 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందా లేదా? ఒకవేళ ఇంకా చెల్లించకపోతే ప్రభుత్వం ఆర్టీసీకి ఎంత బాకీ ఉందో రవాణా శాఖ మంత్రి స్పష్టంగా చెప్పాలని నిలదీశారు. ప్రస్తుతం ఆర్టీసీ లాభాల్లో ఉందా? నష్టాల్లో ఉందా అని కూడా ప్రశ్నించారు. ఒకవేళ సంస్థ లాభాల్లోనే ఉంటే కార్మికులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్, ఎరియర్స్, సీసీఎస్ బకాయిలను ఎందుకు ఇవ్వడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ బకాయి ఉండి మూడేళ్లు అవుతోంది. వారు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆ కొత్త పీఆర్సీని ఎప్పటినుంచి అమలు చేస్తారో స్పష్టం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ యూనియన్లను పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని, దాన్ని ఎప్పటిలోగా అమలు చేసి యూనియన్లను పునరుద్ధరిస్తారో మంత్రి సూటిగా చెప్పాలని నిలదీశారు. గత బీఆరఎస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకుని గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసిందని గుర్తు చేశారు. మరి ఆ ఉద్యోగులను ఏ డేట్ ఆఫ్ అపాయింట్‌మెంట్ నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా ఈ ప్రభుత్వం గుర్తిస్తుందో తేల్చి చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో, సిద్దిపేట సహా పలు డిపోల్లో బస్సుల సంఖ్య దారుణంగా తగ్గిపోయింది.. కొత్త బస్సులు వేయాలని ప్రజలు అడుగుతుంటే తమ దగ్గర సరిపడా బస్సులు లేవు అని డిపో మేనేజర్లు చేతులెత్తేస్తున్నారు., ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందా.. ఇప్పటికే కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ఎప్పుడు ఇస్తారో చెప్పాలి అని హరీష్‌రావు మంత్రిని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. దాటవేత ధోరణి మాని కార్మికుల న్యాయమైన డిమాండ్లను, బస్సుల కొరత సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

**పెండింగ్ డీఏలు ఎప్పటిలోగా చెల్లిస్తారు?**

ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఏకంగా ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టారు.. వాటిని ఎప్పట్లోగా చెల్లిస్తారో మంత్రి సూటిగా సమాధానం చెప్పాలని బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు అసెంబ్లీలో ఉద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల సమస్యలపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఉప ముఖ్యమంత్రి తన ప్రశ్నలకు సమాధానం దాటవేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పీఆర్సీ కమిటీకి మార్చి 31 వరకు పొడిగింపు ఇచ్చారు. ఆ గడువు ముగియడానికి ఇంకో వారం, ఎనిమిది రోజులు మాత్రమే ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా కొత్త పీఆర్సీ ఇస్తామని ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కావస్తున్నా పీఆర్సీ లేదు.. మళ్లీ గడువు పొడిగిస్తారా? కనీసం ఇప్పుడైనా నివేదిక తీసుకుని ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలని అడిగారు. గతంలో కేసీఆర్ ఐఆర్ ఇచ్చి ఆదుకున్నారు, మీరైనా ఐఆర్ పెంచి ఉద్యోగులకు రిలీఫ్ ఇస్తారా లేదా అని నిలదీశారు. 30, 35 ఏళ్లపాటు ప్రభుత్వం కోసం పనిచేసిన రిటైర్డు ఉద్యోగుల వెతలు అంతాఇంతా కాదు.. జీవిత చరమాంకంలో వైద్యం అందక, పిల్లల పెళ్లిళ్లు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. అసలు రాష్ట్రంలో ఎంతమంది రిటైర్ అయ్యారు.. వాళ్లకు చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఎంత.. ఇప్పటివరకు ప్రభుత్వం ఎంత చెల్లించింది.. మిగతా బకాయిలు ఎప్పట్లోగా చెల్లిస్తారో మంత్రి చెప్పాలన్నారు. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా జీవితం గడపాల్సిన ఉద్యోగులు తమ బకాయిల కోసం సెక్రటేరియట్ చుట్టూ, మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ రోజూ తిరుగుతున్నారు.. ఇవాళ రోడ్ల మీద కూర్చుని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.. రిటైర్డ్ ఉద్యోగులకు డబ్బులు ఇవ్వడానికి మీ దగ్గర నిధులు లేవా లేక మనసు లేదా అనేది అర్థం కావడం లేదు అని వ్యంగ్యంగా అన్నారు. ఫ్యూచర్ సిటీకి రూ.లక్ష కోట్లు.. మూసీకి రూ.లక్ష కోట్లు ఉన్నాయి అంటారు.. అందాల పోటీలకు, ఫుట్‌బాల్ షోలకు మీ దగ్గర డబ్బులు ఉన్నాయి.. ముఖ్యమంత్రి రూ.వంద కోట్లతో క్యాంప్ ఆఫీస్ కట్టుకుంటారు.. భట్టి మూడో క్యాంప్ ఆఫీస్ కట్టుకుంటారు.. వాటన్నిటికీ డబ్బులు ఉంటాయి కానీ ఉద్యోగుల పీఆర్సీ, డీఏలకు డబ్బులు లేవంటారు అని హరీష్‌రావు ఎద్దేవా చేశారు.

## హర్మూజ్‌ని దాటి భారత్ దిశగా
# రెండు ఎల్పీజీ నౌకలు




న్యూఢిల్లీ, మార్చి 23 : దేశంలో ఇంధన కొరత ఆందోళనల వేళ.. భారత్‌కు చెందిన కొన్ని నౌకలు నెమ్మదిగా హర్మూజ్ జలసంధిని దాటుతుండటం ఒకింత ఉపశమనం కలిగిస్తోంది. తాజాగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అనుమతితో జగ్ వసంత్, పైన్ గ్యాస్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సోమవారం ఉదయం హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరనున్నట్లు తెలిపాయి. దీంతో దేశీయంగా వంట గ్యాస్ లభ్యత మరికొంత పెరిగే అవకాశం ఉంది. ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు చెందిన నౌకలు రోజులతరబడి అక్కడే నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మన నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటేందుకు.. ఇరాన్ అధికారులతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరిపింది. దీంతో కొన్ని రోజులుగా భారత నౌకలు ఒక్కొక్కటిగా దేశీయ పోర్టులకు చేరుకుంటున్నాయి. అయితే, ఇరాన్ సీనియర్ లీడర్ అలీ లారిజానీ మరణం, ఆ దేశ చమురుక్షేత్రాలపై అమెరికా దాడులు వంటి కారణాలతో నౌకల ప్రయాణానికి అనుమతులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

## ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్
# నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన



అనకాపల్లి, మార్చి 23 (పోలీస్ నిఘా) : ఏపీ పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ప్రపంచంలోనే అగ్రగామి స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎన్ఎంఎస్) ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రులతో కలిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 5,465 ఎకరాల్లో 2 దశల్లో దీనిని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు సంస్థ ప్రతినిధులతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ స్టీల్‌ప్లాంట్ మొత్తం పెట్టుబడి రూ.1,35,964 కోట్లు కాగా.. మొదటి దశలో 2,600 ఎకరాల్లో రూ.80 వేల కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికలు వేశారు. ఈ కర్మాగారంతో లక్ష మందికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆర్సెలార్ మిత్తల్ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ రెండు దశల్లో సాకారం కానుంది. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు నిర్మించనున్నారు. క్యాప్టివ్ పోర్టు ద్వారా మరో 6 వేల ఉద్యోగాలు లభిస్తాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ రీజియన్ పరిశ్రమల హబ్‌గా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# రన్‌వేపై వెళ్తుండగా.. ఫైర్ ట్రక్కును ఢీకొన్న విమానం




న్యూయార్క్, మార్చి 23 : అమెరికాలోని న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో ఓ విమానానికి ప్రమాదం జరిగింది. ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ విమానం రన్‌వేపై వెళ్తుండగా ఫైర్ ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మృతిచెందగా.. మరో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. న్యూయార్క్‌లోని లాగార్డియా ఎయిర్‌పోర్టులో స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 11:30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. కెనడాలోని మాంట్రియల్ నుంచి వచ్చిన ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సీఆర్‌జే-900 విమానం.. లాగార్డియా విమానాశ్రయంలోని నాలుగో రన్‌వేపై దిగింది. అక్కడి నుంచి టాక్సీయింగ్ వైపు వెళ్తుండగా రన్‌వేపై ఉన్న అగ్నిమాపక వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో విమానం ముందు భాగం పైకి లేచి పూర్తిగా ధ్వంసమైంది. ఇందుకు సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాద సమయంలో విమానంలో దాదాపు 100 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ప్రమాద సమయంలో విమానం గంటకు 24 మైళ్ల వేగంతో ప్రయాణించినట్లు ఫ్లైట్ రాడార్ 24 డేటా వెల్లడించింది. ఘటనకు కొన్ని క్షణాల ముందు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు రన్‌వేపై వెళ్తున్న వాహనాన్ని అక్కడే ఆగాలంటూ హెచ్చరించినట్లు తెలిసింది. ఇదే విమానాశ్రయంలో దిగిన యునైటెడ్ 737 మ్యాక్స్ విమానంలో ఎమర్జెన్సీ తలెత్తింది. క్యాబిన్‌లో ఘాటు వాసన రావడంతో విమాన సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో అగ్నిమాపక వాహనానికి సమాచారం ఇచ్చినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. విమానం వద్దకు వచ్చేందుకు ఆ వాహనం రన్‌వే దాటుతుండగా ఎయిర్ కెనడా విమానం ఢీకొట్టింది.

# డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీల ప్రచారం

న్యూఢిల్లీ, మార్చి 23 : నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ ఓచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎలాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియోలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది.

సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది ఎన్నికల పక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని
# అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన




హైదరాబాద్, మార్చి 23 (పోలీస్ నిఘా) : హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణం బీఆర్ఎస్ సభ్యుల నిరసనలతో మార్మోగిపోయింది. రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ప్రాంగణంలో భారీ నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 12 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నట్టే, ఇప్పుడు విద్యార్థుల జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక వేల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం మరింత పటిష్టంగా కొనసాగించి విద్యార్థుల బంగారు బాటకు మార్గం చూపిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల కనీస చిత్తశుద్ధి లేదని, తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ నిరసనలో పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

# ట్రంప్ పరిస్థితి.. ముందు నుయ్యి వెనక గొయ్యి

**సీఐఏ మాజీ అధిపతి**



వాషింగ్టన్, మార్చి 23 : అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తుందని ఆరోపిస్తూ ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించాయి. మూడు వారాలు దాటినా ఆ ఘర్షణలకు ముగింపు మాత్రం కానరావడం లేదు. నాటో మిత్ర దేశాలు కలిసిరావడం లేదు. దాంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యిలా తయారైందని అమెరికా మాజీ రక్షణమంత్రి, సీఐఏ మాజీ అధిపతి లియోన్ పనెట్టా విమర్శించారు. యుద్ధం ఎంతకాలం కొనసాగితే.. ఆయనకు అంత క్లిష్ట పరిస్థితులు ఎదురవుతుంటాయని వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. "ప్రస్తుత పశ్చిమా సంక్షోభం ట్రంప్ సృష్టించిందే. ఇరాన్‌పై యుద్ధానికి వెళ్తే.. ప్రపంచానికి ఎలాంటి ముప్పు ఉంటుందనే దానిపై అమెరికా యంత్రాంగానికి ఎప్పటినుంచో స్పష్టత ఉంది. హర్మూజ్ జలసంధిని బ్లాక్ చేసి , ప్రపంచ ఇంధన రవాణాకు ఇరాన్ అంతరాయం కలిగిస్తుందన్న దానిపై పూర్తి అవగాహన ఉంది. అదేమీ రాకెట్ సైన్స్ కాదు. తాజా ఘర్షణల్లో ట్రంప్ ఆ ప్రమాదాన్ని విస్మరిం చినట్లు కనిపిస్తోంది" అని పనెట్టా పేర్కొ న్నారు.

"సరైన సన్నద్ధత లేకుండానే యుద్ధంలోకి దిగినట్లు అర్థమవుతోంది. ఇరాన్ ప్రతిస్పందనను ట్రంప్ తక్కువగా అంచనా వేసినట్లు లేక యుద్ధం త్వరగా ముస్తుందని భావించినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు అందుకు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఈ యుద్ధ ప్రభావం పశ్చిమాసియాకే పరిమితం కాలేదు. అంతర్జాతీయ మార్కెట్లపైనా పడుతోంది. ట్రంప్ యంత్రాంగం అంచనా వేసినట్టుగా ఇరాన్ బలహీన పడలేదు. తండ్రి కంటే మరింత కఠినంగా వ్యవహరించే మొజ్తాబా ఖమేనీ రాకతో ఆ దేశం మరింత బలపడినట్టుగా ఉంది" అని హెచ్చరించారు.

"ప్రస్తుతం ట్రంప్ కఠిన సమస్యను ఎదుర్కొంటున్నారు. యుద్ధాన్ని అర్థంతరంగా ముగించినా.. కొనసాగించినా తీవ్ర పరిణామాలు తప్పకపోవచ్చు. వెనక్కి వస్తే వైఫల్యంగా భావించవచ్చు. కొనసాగిస్తే.. ప్రస్తుత సంక్షోభాన్ని మరింత పెంచడమే అవుతుంది. ప్రస్తుతం ట్రంప్ ఉన్న పరిస్థితికి ఆయన తప్ప ఇంకెవరూ బాధ్యులు కారు. ఒకవేళ యుద్ధానికి ప్లాన్ చేస్తుంటే.. ముందుగా మిత్రులకు చెప్పడం తప్పేమీ కాదు. నాటోను కాగితం పులి అని ఆయన హేళన చేశారు. ఇప్పుడు తనతో కలిసిరావాలని ఇచ్చిన పిలుపునకు ఏ నాటో దేశం స్పందించడం లేదు. ట్రంప్ ఒంటరి అయినట్లు కనిపిస్తున్నారు. మిత్ర దేశాలతో చర్చించకుండా యుద్ధానికి వెళ్లడం పెద్ద తప్పు" అని అమెరికా మాజీ రక్షణమంత్రి, సీఐఏ మాజీ అధిపతి పనెట్టా దుయ్యబట్టారు.

# దురాక్రమణకు దిగితే.. పర్షియన్ గల్ఫ్ అంతా సీమైన్స్: ఇరాన్



టెహ్రాన్, మార్చి 23 : ఇరాన్‌లో అమెరికా భూతల దాడులకు దిగొచ్చని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. తమ దేశ తీరం లేక ద్వీపాలపై దాడి చేస్తే.. పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ పరుస్తామని తాజాగా ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. ఈ మేరకు రాయిటర్స్ కథనం పేర్కొంది. దాంతో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగొచ్చని పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని వెల్లడించింది. "దాంతో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా.. హర్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితే ఉంటుంది. 1980ల్లో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన సంగతిని మర్చిపోకూడదు'' అని ఇరాన్ తన ప్రకటనలో శత్రుదేశాలకు గుర్తుచేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ఐలాండ్ అత్యంత కీలకమైనది. హర్మూజ్‌ను తెరిచే విషయంలో ఆ దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఆక్రమించాలని యూఎస్ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి తగ్గట్టే 4500 మంది సెయిలర్లు, మెరైన్లను మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్-35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికిల్స్‌లో కూడిన బెటాలియన్‌ను కూడా పంపింది. అయితే ఈ మోహరింపు హర్మూజ్‌ను తెరవడానికా లేక ఖర్గ్ స్వాధీనానికి అనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

**ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను కాపాడతాం: ఇరాన్**

టెహ్రాన్: గ్రీన్‌లాండ్ ద్వీపంపై ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించేందుకు తాము సిద్ధమని ఇరాన్ పోలీస్ అధిపతి అహ్మద్ రెజా రదన్ పేర్కొన్నారు. "గ్రీన్‌లాండ్‌ను అప్పగించాలని ట్రంప్ మొదట ఐరోపాను బెదిరించారు. ఆ తర్వాత వారిని బతిమలాడుకున్నారు. ఇప్పుడు ఏకంగా దాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఐరోపాకు నేను చెప్పేది ఒకటే.. మీరు మీ గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేకపోతే మా సాయం అడగండి. మేము ఆయన నుంచి దాన్ని కాపాడతాం. అందుకు సిద్ధంగా ఉన్నాం" అని అహ్మద్ రెజా తెలిపారు.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279